




PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 18, పేజీలు - 08

సోమవారం, జులై 13, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







# సామాన్యుడికి సుప్రీంకోర్టు మరింత చేరువ కావాలి

- దేశంలో 5 కోట్లు దాటిన పెండింగ్ కేసులు
- ఏళ్ల తరబడి జైల్లో ఉండక్కర్లేదు
- సీజేఐ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో కఠిన చట్టాల కింద నమోదైన కేసుల్లో ఏళ్ల తరబడి జైళ్లలోనే మగ్గిపోతున్న విచారణ ఖైదీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభించబోతోంది. ఉగ్రవాద నిరోధక చట్టం (ఉపా), మనీలాండరింగ్ (పీఎంఎల్ఏ) డ్రగ్స్ నిరోధక చట్టం (ఎన్డీపీఎస్) వంటి కఠినమైన చట్టాల కింద నమోదయ్యే కేసుల విచారణను వేగవంతం చేయడం ఒక్కటే దీనికి ఏకైక మార్గమని భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. బెయిల్ రాక, విచారణ పూర్తికాక ఏళ్ల తరబడి నిందితులు జైళ్లలోనే ఉండటంపై వ్యక్తమవుతున్న ఆందోళనలను ఆయన ప్రస్తావించారు. సుమారు 15 నెలల తన పదవీకాలంలో సగానికి చేరుకున్న సందర్భంగా ఒక ప్రముఖ జాతీయ పత్రికకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సీజేఐ పలు కీలక విషయాలను పంచుకున్నారు.

### ఏడాదిలోనే విచారణ పూర్తి.. ప్రత్యేక కోర్టుల ఏర్పాటు!

ఢిల్లీ అల్లర్ల కేసులు, ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్ వంటి వారు ఎదుర్కొంటున్న ఉపా కేసుల విచారణలో జరుగుతున్న ఆలస్యంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో సీజేఐ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. నిర్దిష్ట కేసులపై నేరుగా స్పందించనప్పటికీ ఈ సమస్యను అధిగమించడానికి న్యాయవ్యవస్థ ఇప్పటికే చర్యలు ప్రారంభించిందని ఆయన తెలిపారు. ఉపా, పీఎంఎల్ఏ, ఎన్డీపీఎస్ కేసుల కోసం ప్రత్యేకంగా ప్రత్యేక కోర్టులను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు చెప్పారు. ఈ ప్రతిపాదనకు ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, కోర్టుల ఏర్పాటు ప్రక్రియ కూడా మొదలైందని తెలిపారు. ఈ ప్రత్యేక కోర్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చి, ఏడాది కాల పరిమితిలోగా విచారణలు పూర్తి చేయడం ప్రారంభిస్తే విచారణ ఖైదీల సుదీర్ఘ బంధీలపై సాగుతున్న వివాదానికి తెరపడుతుందని సీజేఐ ఆశాభావం వ్యక్తం చేశారు.

### - 5 కోట్లు దాటిన కేసులు..
### సామాన్యుడికి సుప్రీంకోర్టు దూరం కాకూడదు!

ప్రస్తుతం న్యాయవ్యవస్థ ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు గుట్టలుగా పేరుకుపోతున్న కేసుల పెండింగేనని

2లో..

# గాల్లోనే ఆవిరైపోతున 25శాతం వర్షం

- ఐఐటీఎం షాకింగ్ రిపోర్ట్



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** రుతుపవన వర్షాల కోసం ప్రతీ ఏటా ఎదురుచూసే భారతదేశంలో చివరికి పడే వర్షాల్లో సైతం నాలుగోవంతు గాల్లోనే ఆవిరైపోతున్నట్లు తాజాగా ఓ అధ్యయనంలో తేలింది. ముఖ్యంగా నైరుతి రుతుపవనాల సమయంలో వాయువ్య కనుమలపై కురిసే వర్షంలో 25 శాతం గాల్లోనే ఆవిరైపోతున్నట్లు పూణేకు చెందిన ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియోరాలజీ (ఐఐటీఎం) తన అధ్యయనంలో గుర్తించింది. మన దేశంలో ఓ ప్రయోగం ద్వారా తొలిసారి ఈ నిష్పత్తిని కొలిచారు.ప్రతీ ఏటా జూన్ నుండి సెప్టెంబర్ వరకు ఉండే 4 రుతుపవన మాసాలలో కురిసే వర్షం వాస్తవ పరిమాణం రోజురోజుకీ మారుతూ 4-61 శాతం వరకు ఉంటోందని శాస్త్రవేత్తలు తెలిపారు. ప్రస్తుతం పశ్చిమ కనుమలపై వర్షపు బిందువుల ఆవిరిని కొలవడంతో ఇదే పద్ధతితో దేశవ్యాప్తంగా పరిశోధన నిర్వహించే అవకాశాలు మెరుగుపడ్డాయి. ఈ పరిశోధన అట్మాస్ఫియరిక్ కెమిస్ట్రీ అండ్ ఫిజిక్స్

2లో..

# రైతులకు నీళ్లు అడిగితే, రక్తం పారిస్తా అంటావా?

- షాబాద్ ఉన్మాదికి సీఎంకు తేడా లేదన్న హరీష్ రావు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ఇరిగేషన్ శాఖపై కనీస అవగాహనా లేని సీఎం రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడి నవ్వులపాలు అయ్యారని బీఆర్ఎస్ పార్టీ శాసనసభాపక్ష ఉపనేత, మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. మేడిగడ్డ బ్యారేజీ గేట్లు మూయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ నుంచి నీళ్లు ఎత్తిపోయవచ్చునని రిటైర్డ్ ఇంజినీర్లు చెప్పినా సీఎంకు సోయి రాలేదంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అబద్ధాలు చెప్పడంలో రేవంత్ రెడ్డితో ఎవరూ పోటీ పడలేరని, ఆయన మాటలు వింటుంటే ఒక సైకో తరహా ప్రవర్తన కనిపిస్తోందని విమర్శించారు.

### - రిటైర్డ్ ఇంజినీర్లు చెప్పినా సీఎంకు సోయి రాలేదు..

ఇరిగేషన్ అంశాలపై

2లో..

# విజయవాడలో ఘోర అగ్నిప్రమాదం

- ఆటోనగర్‌లో తగలబడిన 7 ప్రైవేట్ బస్సులు



విజయవాడ (ప్రశ్న న్యూస్) ఆటోనగర్‌లో అన్ని రకాల వెహికల్స్ హాల్ట్‌లో ఉంటాయి. కొన్ని మరమ్మతుల కోసం తీసుకొచ్చి అక్కడ పెడతారు. ఇక ప్రైవేట్ ట్రావెల్స్‌కి సంబంధించిన బస్సులు కూడా ఇక్కడ ఉంటాయి.

2లో..

# అసెంబ్లీ నియోజకవర్గాలకు టీడీపీ కొత్త ఇంఛార్జ్‌లు

- క్షేత్ర స్థాయిలో బలోపేతమే లక్ష్యంగా మార్పు?



అమరావతి (ప్రశ్న న్యూస్) ఏపీ రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కూటమి పార్టీలు వచ్చే ఎన్నికల కోసం ముందస్తు వ్యూహాలు అమలు చేస్తున్నారు. వైసీపీ లక్ష్యంగా రాజకీయ వ్యూహాలను అమలు చేస్తున్నాయి. అటు వైసీపీ సైతం కూటమి టార్గెట్ గా కొత్త ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. ఈ సమయంలోనే టీడీపీ పలు నియోజకవర్గాలకు కొత్త ఇంఛార్జ్ లను ప్రకటించింది. అదే విధంగా పలు చోట్ల మార్పులు చేస్తోంది. తాజా కసరత్తు వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు కనిపిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మిత్రపక్షాలు.. వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాలకు కొత్త ఇంఛార్జ్ లను నియమించారు. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతం.. మిత్రపక్ష పార్టీలతో సమన్వయం బాధ్యతలను వారికి అప్పగించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ క్రమంలో భాగంగా అన్ని నియోజకవర్గాల్లో బలమైన ఇంఛార్జ్ లను నియమించాలని నిర్ణయించారు. టీడీపీ ఎమ్మెల్యేలు లేని నియోజకవర్గాల్లో ఈ బాధ్యతలను కేటాయిస్తున్నారు. అందులో భాగంగా తిరుపతి నియోజకవర్గ టీడీపీ కొత్త ఇంఛార్జ్ గా జేబీ శ్రీనివాస్ కు బాధ్యతలు కేటాయించారు. ఇక్కడ జనసేన ఎమ్మెల్యే ఉన్నారు. సుగుణమ్మ కు నామినేటెడ్ పదవి దక్కటంతో కొత్తగా శ్రీనివాస్ ను నియమించారు. అదే విధంగా కాకినాడ రూరల్ నియోజకవర్గానికి మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిని ఇంఛార్జ్‌గా నియమించారు. ఆమె 1999, 2014 లలో ఇదే నియోజకవర్గం నుండి టీడీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించి క్రియాశీలకంగా పనిచేశారు. ప్రస్తుతం అక్కడ జనసేన నుంచి పంతం నానాజీ ఎమ్మెల్యేగా ఉన్నారు. కాగా.. పెండింగ్‌లో ఉన్న పలు నియోజకవర్గలకు కొత్త ఇన్‌చార్జ్‌ల ఎంపికపై అధినేత కసరత్తు చేస్తున్నారు. అలాగే, 9 అసెంబ్లీ నియోజకవర్గాలకు నూతన ఇన్‌చార్జ్‌లను నియమించనున్నారు. విశాఖపట్నం నార్త్, ఎచ్చెర్ల, పి. గన్నవరం,

2లో..

# కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్

- సీఎం రేవంత్‌రెడ్డికి బీజేపీ నేత రామచందర్‌రావు లేఖ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాళేశ్వరం ప్రాజెక్టు వినియోగం విషయంలో ఇప్పటివరకూ బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీగా ఉన్న వివాదంలోకి బీజేపీ ఎంట్రీ ఇచ్చింది. ప్రాజెక్టు పనికొస్తుందని బీఆర్ఎస్ చెబుతుంటే, నీళ్లు నింపితే 40 ఊర్లు కొట్టుకుపోతాయని సీఎం రేవంత్ రెడ్డి చెబుతున్నారు. అయితే కాళేశ్వరం పునరుద్ధరణ విషయంలో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు విమర్శించారు. ఎన్డీఎస్ఏ రిపోర్ట్ ఇచ్చినా బ్యారేజీల పునరుద్ధరణ పనులను తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని ఆయన మండిపడ్డారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) గతంలో చేసిన సిఫారసులను రాష్ట్ర ప్రభుత్వం సకాలంలో అమలు చేయకపోవడం వల్లే నేడు తెలంగాణ రైతులకు ఈ దుస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌డీఎస్ఏ నివేదికను అడ్డుపెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. రాజకీయాలను పక్కనబెట్టి, ప్రజల ప్రయోజనాల కోసం కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

2లో..

# టీఆర్ఎస్ పార్టీకి గుర్తింపునివ్వండి

- 105 నియోజకవర్గాల్లో జెండా ఎగరేశామన్న కవిత




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తాము ప్రతిపాదించిన 'తెలంగాణ రక్షణ సేన' పార్టీకి తక్షణమే గుర్తింపు ఇవ్వాలని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీ) విజ్ఞప్తి చేశారు. ఈ నెల 7వ తేదీన ఢిల్లీ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల ప్రకారం కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఆమె తన లిఖితపూర్వక సమాధానాన్ని సమర్పించారు. ఈ మేరకు పార్టీ ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ ఆదివారం కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్, ఇతర కమిషనర్లకు అధికారికంగా లేఖ రాశారు. ఈ ఏడాది ఏప్రిల్ 28నే ఈసీ తమకు 'తెలంగాణ రక్షణ సేన' పేరును కేటాయిస్తూ లేఖ ఇచ్చిందని, ఆ నమ్మకంతోనే తెలంగాణవ్యాప్తంగా 105 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ జెండాలు ఆవిష్కరించి, సంస్థాగత నిర్మాణాన్ని కూడా పూర్తి చేసుకున్నామని లేఖలో వివరించారు. పార్టీ రిజిస్ట్రేషన్‌పై సుమారు వెయ్యి అభ్యంతరాలు వచ్చాయని జూన్ 23న ఈసీ తమకు లేఖ రాసిందని, కానీ అందులో ఒక్క కాపీని కూడా తమకు పంపలేదని కవిత లేఖలో ఆక్షేపించారు. "ఆ అభ్యంతరాలు ఎవరు వ్యక్తం చేశారు? అందులో ఏముందో మాకు తెలియకుండా మేము ఎలా సమాధానం చెప్పగలం? మూడున్నర కోట్ల జనాభా ఉన్న తెలంగాణలో కేవలం వెయ్యి మంది అభ్యంతరం తెలిపారనే సంఖ్యను చూపిస్తూ ఈసీ నిర్ణయం తీసుకోవడం సరికాదు" అని పేర్కొన్నారు. ఎవరైనా కావాలనే గ్రూపులుగా ఏర్పడి, ప్లాన్ ప్రకారం ఇదంతా చేయించారా అనే కోణంలో పరిశీలించాల్సి ఉందన్నారు. ఢిల్లీ హైకోర్టు ఆదేశాల ప్రకారం తాము ఈసీ ఎదుట వ్యక్తిగత విచారణకు హాజరయ్యే ముందే ఆ 1000 అభ్యంతరాల కాపీలను, తమకు వ్యతిరేకంగా ఉన్న ఆధారాలను అందజేయాలని, వాటిని పరిశీలించడానికి తగిన సమయం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

### - మాకెందుకు అభ్యంతరం?

'తెలంగాణ రక్షణ సేన' అనే పేరును తాము పూర్తి సదుద్దేశంతో, స్వతంత్రంగా ఆలోచించి పెట్టామని దేశంలో ఈ పేరుతో మరే ఇతర పార్టీ నమోదు కాలేదని కవిత స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల పేర్లను విడివిడి ముక్కలుగా

2లో..

# ప్రజల పాపం తగిలి ఫాంహౌస్‌లోనే

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) యాదాద్రి భువనగిరి జిల్లాలో రహదారి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఆలేరు, భువనగిరి ప్రజలకు జరిగిన అన్యాయానికి ఫలితంగానే కేసీఆర్ కాలు విరిగి ఫాంహౌస్‌కే పరిమితమయ్యారని సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో తెలంగాణను భారీ అప్పుల ఊబిలోకి నెట్టారని ఆరోపించారు. వంగపల్లిలో హ్యామ్ ఫేజ్-1 కింద రూ.339.59 కోట్ల వ్యయంతో 109.30 కిలోమీటర్ల మేర 7 రహదారుల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన తర్వాత మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని మిగులు బడ్జెట్‌తో కేసీఆర్‌కు అప్పగిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.8 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టిందని విమర్శించారు. గత పాలకులు నిర్లక్ష్యం చేసిన అభివృద్ధి పనులను ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వేగంగా పూర్తి చేస్తోందన్నారు. బస్వాపూర్, గందమల్ల ప్రాజెక్టులను త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

2లో..

# ఫ్లైఓవర్ల కింద 'విద్యుత్' విప్లవం

- ఫ్లైఓవర్ల కింద విద్యుత్ సబ్‌స్టేషన్లు
- స్థలాల కొరతకు టీజీఎస్పీడీసీఎల్ చెక్
- హైదరాబాద్‌లో వినూత్న ప్రయోగం




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ మహానగరంలోని ఫ్లైఓవర్ల కింద ఇప్పటివరకు అందమైన పూల మొక్కలు, ఆటస్థలాలు, వాహనాల పార్కింగ్‌లను మాత్రమే చూసిన నగరవాసులకు త్వరలో

2లో..

# జూబ్లీహిల్స్ లో ఫెరారీ కారు బీభత్సం

- ప్రమాదం తర్వాత కారును వదిలేసి పరారైన వ్యక్తులు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున ఓ లగ్జరీ కారు బీభత్సం సృష్టించింది. వేగంగా దూసుకొచ్చిన ఫెరారీ కారు అదుపుతప్పి ఓ అపార్ట్‌మెంట్ గేటును బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, అయితే కారులో ఉన్నవారు దానిని అక్కడే వదిలేసి పరారయ్యారని అధికారులు తెలిపారు.

2లో..

## బాటిల్‌లోని నీరు తాగిన మహిళ..
## అది యాసిడ్ కావడంతో ఆసుపత్రిపాలు



లక్నో: ఒక మహిళ ఆభరణాల కొనుగోలు కోసం జ్యుయలరీ షాపునకు వెళ్లింది. ఆమె వాటర్ కావాలని అడగటంతో సమీపంలోని షాపు నుంచి వాటర్ బాటిల్ తెప్పించారు. ఆ బాటిల్‌లోని నీరు తాగిన ఆ మహిళ అది యాసిడ్ అని తెలుసుకుని షాక్ అయ్యింది. ఆమె అస్వస్థత చెందడంతో ఆసుపత్రిపాలైంది. ఉత్తరప్రదేశ్‌లోని హాపూర్‌లో ఈ సంఘటన జరిగింది. జూలై 10న సాయంత్రం వేళ ఒక మహిళ అర్జున్ నగర్ ప్రాంతంలోని ఒక జ్యుయలరీ షాపునకు వెళ్లింది. దాహం వేయడంతో మంచినీరు అడిగింది.కాగా, జ్యుయలరీ షాపు సిబ్బంది సమీపంలోని ఒక షాపులో వాటర్ బాటిల్ కొనుగోలు చేశారు. ఆ షాపు యజమాని ఫ్రిజ్ నుంచి వాటర్ బాటిల్ తీసి సిబ్బందికి ఇచ్చాడు. ఆ బాటిల్ అందుకున్న ఆ మహిళ మూత తెరిచి ఒక గుక్క తాగింది. ఆ వెంటనే బాధతో ఆమె అల్లాడిపోయింది. బాటిల్‌లో ఉన్నది యాసిడ్ అని గ్రహించి షాక్ అయ్యింది. వెంటనే బయటకు పరుగెత్తి ఉమ్మేందుకు ప్రయత్నించింది. ఆ మహిళ ఆరోగ్యం క్షీణించడంతో తొలుత స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు వాటర్ బాటిల్ అమ్మిన షాప్ యజమానిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. ఆ వాటర్ బాటిల్ మూత సీల్ వేసి ఉన్నదని, ఫ్రిజ్ నుంచి దానిని తీసి అలాగే ఇచ్చినట్లు ఓనర్ చెప్పాడు. అయితే ఆ షాపు నుంచి కొన్ని యాసిడ్ బాటిల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. జ్యుయలరీ షాపులోని సీసీటీవీలో రికార్డైన ఈ సంఘటనకు సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున అరెస్టు..
### గుంటూరులో అదుపులోకి తీసుకున్న తెలంగాణ పోలీసులు!




వైసీపీ అధికార ప్రతినిధి నాగార్జున యాదవ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. గుంటూరులోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు తెలంగాణ పోలీసులం అని కుటుంబసభ్యులకు చెప్పారు.ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే నాగార్జున యాదవ్‌ను పోలీసులు తీసుకెళ్లారు. దీనిపై అడగ్గా.. నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తామని పోలీసులు తెలిపారు. కాగా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే నాగార్జున యాదవ్‌ను అరెస్టు చేశారని కుటుంబసభ్యులు ఆందోళన చేపట్టారు.ఇటీవల ఓ లైవ్ డిబేట్‌లో నాగార్జున యాదవ్ సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి ఒక జొమాటో డెలివరీ బాయ్ అని ఎద్దేవా చేశారు. ఆయనకు ఒక ప్రభుత్వ జీవో చదవడం కూడా రాదని.. కనీసం ఎమ్మెల్యేగా కూడా పనికిరాడని విమర్శించారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే నాగార్జున యాదవ్‌ను అరెస్టు చేసి ఉంటారని తెలుస్తోంది.

## సీడ్స్, ఫెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్ వెల్ఫేర్
## అసోసియేషన్ టేకులపల్లి నూతన కమిటీ ఎన్నిక




టేకులపల్లి, జూలై 11: సీడ్స్, ఫెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్ వెల్ఫేర్ అసోసియేషన్ టేకులపల్లి మండల నూతన కమిటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఖమ్మం జిల్లా టేకులపల్లి మండలంలోని చుక్కలబోడు రైతు వేదికలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. టేకులపల్లి మండలం నూతన కమిటీ అధ్యక్షులుగా నాగినేని రాఘవ, కార్యదర్శిగా భూక్యా లవ కుమార్ , కొందరు సభ్యులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నల్ల సోమసుందర్ మాట్లాడుతూ.. సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని నూతన కమిటీకి సూచించారు. ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వ్యాపారుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడం, సభ్యుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేయడం, సంఘాన్ని మరింత బలోపేతం చేయడం నూతన కమిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు.ఇక నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. సభ్యులందరినీ కలుపుకొని సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేస్తామని హామీ ఇచ్చారు.

## చేతబడి చేసి వేధించినట్లు కోడలు ఆరోపణ..
### శివసేన (యూబీటీ) నేత, ఆయన కుమారుడిపై కేసు

ముంబై: తనపై చేతబడి చేశారని, శారీరకంగ, మానసికంగా వేధించడంతోపాటు బలవంతంగా ఆవు మూత్రం తాగించినట్లు ఒక మహిళ ఆరోపించింది. పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ, ఆయన కుమారుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మహారాష్ట్రలోని థానేలో ఈ సంఘటన జరిగింది. ఉద్ధవ్ ఠాక్రే నేతృత్వంలోని శివసేన (యూబీటీ) నేత, మాజీ ఎంపీ వినాయక్ రౌత్, కోడలు గిరిజ పలు ఆరోపణలు చేశారు. మామ, భర్త తనను శారీరకంగా, మానసికంగా హింసించారని, తనతో బలవంతంగా గోమూత్రం తాగించారని ఆమె ఆరోపించింది. అంతేగాక తనపై చేతబడి చేశారని, ఫిరోజ్ బాబా, ఖాజీ బాబా అనే ఇద్దరు క్షుద్ర మాంత్రికులతో క్షుద్ర పూజలు చేయించారని, దీని కోసం తన తల నుంచి వెంట్రుకలను వారు పీకారని పోలీసులకు ఆమె ఫిర్యాదు చేసింది. కాగా, శివసేన (యూబీటీ) నేత, మాజీ ఎంపీ వినాయక్ రౌత్ కోడలు గిరిజ ఫిర్యాదుపై పోలీసులు స్పందించారు. ఆ నేతతో పాటు భర్త అయిన ఆయన కుమారుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## రైతులకు నీళ్లు అడిగితే,
## రక్తం పారిస్తా అంటావా?

ముఖ్యమంత్రికి కనీస అవగాహన లేదని హరీష్ రావు పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ గేట్లు మూసివేయకుండానే కన్నెపల్లి పంప్ హౌస్ మోటర్లను ఆన్ చేయవచ్చనే కనీస సోయి రిటైర్డ్ ఇంజనీర్లు చెప్పిన తర్వాత కూడా సీఎంకు రాలేదన్నారు. ఉన్న వాస్తవాలు బయటపెడితే రిటైర్డ్ ఇంజనీర్లను జైల్లో వేస్తానని సీఎం రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుష్ప్రచారం బయటపడుతుందనే భయంతోనే నీళ్లు ఇవ్వకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు. నాడు కేసీఆర్ తన ప్రాణాలను పణంగా పెట్టి, దీక్ష చేసి రాష్ట్రాన్ని సాధించారే తప్ప ఎన్నడూ రక్తం పారించే ప్రయత్నం చేయలేదని గుర్తుచేశారు. కానీ నేడు రేవంత్ రెడ్డి మాత్రం రైతుల పక్షాన నిలబడి నీళ్లు అడిగిన వారిని కోస్తా, రక్తం పారిస్తా అనడం దారుణమని, ఇదే కేసీఆర్‌కు రేవంత్ రెడ్డికి ఉన్న తేడా అని హరీష్ రావు హితవు పలికారు. పొలాల్లో నీళ్లు పారించమంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బూతులు పారిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో హిట్లర్ తనకు ఆదర్శమని చెప్పుకున్న రేవంత్ రెడ్డి, ఇప్పుడు హిట్లర్ తరహాలోనే హింసను ప్రేరేపించే హంతక భాష మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. ఓటమి భయంతో, తీవ్రమైన ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నందువల్లే సీఎం ఇలాంటి బూతు భాషను అందుకుంటున్నారని రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని హరీష్ రావు పేర్కొన్నారు.

**- షాబాద్ హత్యల ఉన్మాదికి, రేవంత్ రెడ్డికి పెద్ద తేడా ఏమీ లేదు**

షాబాద్‌లో ఆరుగురిని గొంతు కోసి కిరాతకంగా చంపిన ఉన్మాది రాజ్‌కుమార్‌కు, సీఎం రేవంత్ రెడ్డికి మధ్య పెద్ద తేడా ఏమీ కనిపించడం లేదని హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. 'నాకు దక్కనిది ఎవరికీ దక్కొద్దు' అనే ఉన్మాదంతో ఆ హంతకుడు ఆరుగురిని కోడిని కోసినట్లు కోసి దారుణంగా చంపేశాడని, ఆ ఇంట్లో ఇప్పుడు మాటలు రాని, నడవలేని ఒక దివ్యాంగ అమ్మాయి మాత్రమే మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతటి ఘోర ఉదంతం జరిగితే పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు స్పందించారు కానీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ కి కనీసం స్పందించే తీరిక లేకపోయిందని విమర్శించారు. అంతేకాకుండా, నిన్న అంత పెద్ద ఉన్మాదకాండ జరిగితే, రాష్ట్రానికి చెందిన ఓ పోలీస్ ఉన్నతాధికారి హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్‌లో గోల్ఫ్ ఆడుతూ టైమ్ పాస్ చేశారని, దీన్ని బట్టే రాష్ట్రంలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందని ఎద్దేవా చేశారు.

**- మేడిగడ్డ - కన్నెపల్లి పంప్ హౌస్ వివాదం**

కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బారేజ్ గేట్ల వ్యవహారంపై గత కొంతకాలంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య తీవ్ర యుద్ధం నడుస్తోంది. మేడిగడ్డ బారేజ్ పిల్లర్లు కుంగిపోవడంతో, అక్కడ నీటిని నిల్వ చేయకుండా గేట్లను తెరిచి ఉంచారు. అయితే, గేట్లు తెరిచి ఉన్నా కూడా కన్నెపల్లి పంప్ హౌస్ మోటర్లను ఆన్ చేసి నీటిని ఎత్తిపోయవచ్చని బీఆర్ఎస్ నేతలు, కొందరు రిటైర్డ్ ఇంజనీర్లు సూచిస్తున్నారు. కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం దీనికి భిన్నంగా వాదిస్తోంది. మోటర్లు ఆన్ చేస్తే గతంలో తాము చేసిన ఆరోపణలు అబద్ధమవుతాయనే ఉద్దేశ్యంతోనే, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు నీరు ఇవ్వకుండా అడ్డుపడుతోందని హరీష్ రావు ఆరోపిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నాడు కేసీఆర్ చేసిన 11 రోజుల ఆమరణ నిరాహార దీక్షను హరీష్ రావు ఈ సందర్భంగా గుర్తుచేశారు. కేసీఆర్ రాష్ట్రాన్ని సాధించే క్రమంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయలేదని, కానీ ఎన్నడూ హింసను ప్రోత్సహించలేదని అన్నారు. ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మాత్రం తనను ప్రశ్నించిన వారిని, రైతులను ఉద్దేశించి "కోస్తా, రక్తం పారిస్తా" అంటూ మాట్లాడటం సరైన పద్ధతి కాదని హరీష్ రావు హితవు పలికారు.

## విజయవాడలో ఘోర అగ్నిప్రమాదం

ఆదివారం రాత్రి వేళ ట్రావెల్స్ బస్సులు హైదరాబాద్ హైవే పై రయ్యి రయ్యిమంటూ వెళ్లాలంటే ఇక్కడ చిన్న చిన్నరిపేర్స్ చేయాలి. అలాంటి విజయవాడ ఆటోనగర్‌లో ఉన్నట్టుండి మంటలు చెలరేగి ఏడు బస్సులు దగ్ధమయ్యాయి.విజయవాడ ఆటోనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. మరమ్మతుల కోసం తీసుకొచ్చిన బస్సులో మంటలు చెలరేగడంతో ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ఏడు బస్సులు పూర్తిగా కాలిపోయినట్లు తెలుస్తోంది. ఓ మెకానిక్ షెడ్డులో రిపేర్స్ కోసం బస్సులను నిలిపి ఉంచగా అందులోని ఓ బస్సు నుంచి మంటలు చెలరేగాయి. చూస్తుండగానే ఆ మంటలు మిగితా బస్సులకూ వ్యాపించాయి. ఆటోనగర్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే మూడు ఫైర్ ఇంజన్లు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశాయి. అగ్నిమాపక సిబ్బంది ఎంత ప్రయత్నించినా అప్పటికే ఏడు బస్సులు పూర్తిగా దగ్ధమయ్యాయి. అయితే, ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం చోటుచేసుకోలేదు, ఏ ఒక్కరూ గాయపడలేదు. ప్రమాదానికి అసలు కారణం ఏంటో మాత్రం ఎవ్వరికీ తెలియలేదు. దాంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఒక బస్సుకు రిపేర్ చేస్తుండగానే మంటలు అంటుకున్నాయని అక్కడి స్థానికుల సమాచారం మేరకు తెలుస్తోంది. అయితే, ఆ మంటలు ప్రమాదవశాత్తు అంటుకున్నాయా? లేక ఎవరైనా కావాలనే చేశారా అన్నది మాత్రం తెలియలేదు. దట్టమైన పొగలు వ్యాపించడంతో అక్కడున్న వారు భయాందోళనకు గురయ్యారు. చుట్టూ వెహికల్స్ ఉండటంతో ఆ మంటలు మిగతా వాటికి కూడా అంటుకునే ప్రమాదం ఉందని భయపడ్డారు.. కానీ అగ్నిమాపక సిబ్బంది సరైన సమయానికి సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## అసెంబ్లీ నియోజకవర్గాలకు టీడీపీ కొత్త ఇంఛార్జ్ లు

అనపర్తి, అవనిగడ్డ, విజయ వాడ వెస్ట్, తంబళ్లపల్లి, పిఠాపురం, కైకలూరు నియోజకవర్గాల్లో కొత్త ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు అప్పగించనున్నారు. అదే విధంగా వివాదాస్పదంగా మారి.. వైఖరి మార్చుకోని ఎమ్మెల్యేల నియోజకవర్గాల్లోనూ కొత్త ఇంఛార్జ్ లను నియమించే ఆలోచన చేస్తున్నట్లు సమాచారం.

## కాళేశ్వరం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫెయిల్

ఈ మేరకు బీజేపీ నేత రామచందర్‌రావు సీఎం రేవంత్ రెడ్డికి ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖతో కాళేశ్వరం పాలిటిక్స్ మరింత రసవత్తరంగా మారనున్నాయి.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు దాటినా ఎన్‌డీఎస్ఏ (ఎన్డీఎస్ఏ) సిఫారసులను అమలు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందని రామచందర్‌రావు విమర్శించారు. రిటైర్డ్ ఇంజినీర్లు, ఇరిగేషన్ శాఖ నిపుణుల సూచనల ప్రకారం బ్యారేజీల పునరుద్ధరణ పనులను రెండేళ్లలోనే పూర్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ఆ విషయాన్ని పట్టించుకోలేదన్నారు. దీని ఫలితంగా కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని, దాదాపు 200 టీఎంసీల గోదావరి జలాలను తెలంగాణ వాడుకోలేక సముద్రం పాలు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పునరుద్ధరణ బాధ్యతను కేంద్ర కమిటీపై నెట్టేయడాన్ని తప్పుబడుతూ కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ కేవలం మార్గదర్శకాలు మాత్రమే ఇస్తుందని, పనులు చేయించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.మేడిగడ్డ బారేజ్‌లో నీటిని నిల్వ చేయకుండానే, కన్నెపల్లి పంప్‌హౌస్ ద్వారా నీటిని ఎత్తిపోసే సాంకేతిక అవకాశం ఉందని రామచందర్‌రావు తన లేఖలో పేర్కొన్నారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను వేగంగా పూర్తి చేసి ఉంటే ప్రస్తుతం ఉత్తర తెలంగాణలో 20 నుంచి 25 లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు హైదరాబాద్ నగరానికి 10 టీఎంసీల తాగునీరు అందించే వీలుండేదన్నారు. ఈ సందర్భంగా విజిలెన్స్ కమిషన్, కాళేశ్వరంపై తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ నివేదికలను ఎందుకు బహిర్గతం చేయడం లేదని ఆయన సీఎం రేవంత్ రెడ్డిని నిలదీశారు. రాజకీయాలకు ఇది సమయం కాదని, కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడి ప్రజలకు ముఖ్యంగా ఉత్తర తెలంగాణ రైతులకు గోదావరి జలాలను అందించాలని సీఎం రేవంత్ రెడ్డికి తాను రాసిన లేఖలో కోరారు.

## జూబ్లీహిల్స్ లో ఫెరారీ కారు బీభత్సం

ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 5లో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఫోర్ట్ వ్యూ అపార్ట్‌మెంట్స్ గేటును కారు ఢీకొట్టడంతో అది పూర్తిగా ధ్వంసమైంది. సుమారు రూ. 3.50 కోట్లకు పైగా విలువ చేసే ఫెరారీ రోమా కారు ముందు భాగం కూడా నుజ్జునుజ్జయింది. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్, అందులోని ఇతర వ్యక్తులు అక్కడి నుంచి పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మద్యం మత్తులో అతివేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.?

కారులో ఎంతమంది ఉన్నారనేది తెలుసుకునేందుకు సమీపంలోని సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. ధ్వంసమైన కారును టోయింగ్ వాహనం సహాయంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొన్ని రోజుల వ్యవధిలో జూబ్లీహిల్స్‌లో ఇలాంటి ఘటన జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. జూలై 9న రాత్రి, రోడ్ నంబర్ 10లో ప్రముఖ నటుడు ధర్మ ఇంటి కాంపౌండ్ వాల్‌ను ఓ ఎస్‌యూవీ ఢీకొట్టింది. ఆ సమయంలో మద్యం మత్తులో ఉన్న కార్తీక్ కుమార్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇప్పుడు మరో ఘటన జరగడంతో ఈ ప్రాంతంలో వరుస ప్రమాదాలు కలకలం రేపుతున్నాయి.

## ఫ్లైఓవర్ల కింద 'విద్యుత్' విప్లవం

ఒక సరికొత్త సాంకేతిక మార్పు కనిపించనుంది. నగరంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవడానికి, స్థలాల కొరతను అధిగమించడానికి ఫ్లైఓవర్ల కింద 33/11కేవీ సామర్థ్యం గల సబ్‌స్టేషన్లను నిర్మించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్తు పంపిణీ సంస్థ ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఈ వినూత్న ప్రాజెక్టులో భాగంగా సిటీలోని వేర్వేరు పైవంతెనల కింద మొత్తం పది ఉపకేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ప్రాథమికంగా మూడు కీలకమైన ప్రాంతాలలో నిర్మాణ పనులు చేపట్టేందుకు అనువైన స్థలాలను అధికారులు ఇప్పటికే అధికారికంగా ఎంపిక చేశారు.నగరంలోని క్యూర్ పరిధిలోకి వచ్చే పది సర్కిళ్ల పరిధిలో ఇప్పటికే దాదాపు 450 వరకు విద్యుత్తు ఉపకేంద్రాలు నిరంతరాయంగా సేవలందిస్తున్నాయి. అయితే నగర శివార్లలో కొత్త సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు అవసరమైన ప్రభుత్వ స్థలాలు సులభంగానే దొరుకుతున్నప్పటికీ ప్రధాన నగరం, ఐటీ కారిడార్ పరిధిలో మాత్రం ఖాళీ స్థలాల తీవ్ర కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఇంధనశాఖ కార్యదర్శి నవీన్‌మిట్టల్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేశ్ వి పాటిల్, ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వి.శివాజీ తదితర ఉన్నతాధికారులు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఈ చర్చల అనంతరం తీవ్రమైన స్థలాల కొరత ఉన్న 10 ప్రాంతాల్లోని పైవంతెనల కింద సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు జీహెచ్‌ఎంసీ యంత్రాంగం పూర్తి స్థాయిలో గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఈ ప్రణాళిక ప్రకారం ఐటీ కారిడార్‌లోని కొండాపూర్ ఫ్లైఓవర్ కింద పిల్లర్ నంబరు 2, 3 మధ్య ఒక ఉపకేంద్రాన్ని, అలాగే అదే ఫ్లైఓవర్ చివరన ఆర్టీవో కార్యాలయం వైపు ఉన్న పిల్లర్ నంబరు 59 నుంచి 61 మధ్య మరో ఉపకేంద్రాన్ని నిర్మించాలని నిర్ణయించారు. వీటితో పాటు నల్లగండ్ల ప్రాంతం కోసం గతంలో మంజూరైన ఉపకేంద్రాన్ని స్థల లభ్యత ఆధారంగా గచ్చిబౌలి ఫ్లైఓవర్ కింద నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మిగిలిన ఏడు సబ్‌స్టేషన్ల కోసం ఆపరేషన్ సర్కిల్స్ అధికారులతో కలిసి ఇంజనీర్లు అనువైన ఫ్లైఓవర్లను ఎంపిక చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సబ్‌స్టేషన్లను అత్యాధునిక ఇండోర్ సబ్‌స్టేషన్ల మాదిరిగా పూర్తి రక్షణ గోడలతో నిర్మిస్తారు. వీటిలో 12.5 ఎంవీఏ నుంచి 16 ఎంవీఏ వరకు అధిక సామర్థ్యం కల్గిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్రాజెక్టులో ఒక్కో ఉపకేంద్రం నిర్మాణానికి సుమారు రూ. 7 నుంచి 8 కోట్ల వరకు భారీ వ్యయం అవుతుందని అంచనా వేస్తున్నారు. ఫ్లైఓవర్ల కింద ఇటువంటి హై-వోల్టేజ్ విద్యుత్ కేంద్రాలను నిర్మించడం వల్ల ప్రజల భద్రతకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా టీజీఎస్పీడీసీఎల్ అధికారులు అన్ని రకాల అత్యాధునిక సాంకేతిక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ సబ్‌స్టేషన్లలో డ్రై టైప్ ట్రాన్స్‌ఫార్మర్లను వాడాలా లేక సాంప్రదాయ ఆయిల్ ఉండే వెట్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలా అనే అంశంపై ఇంజినీరింగ్ నిపుణులతో లోతుగా చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని టీజీఎస్పీడీసీఎల్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వి.శివాజీ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## టీఆర్ఎస్ పార్టీకి గుర్తింపునివ్వండి

చూడకూడదని, సమగ్రంగా చూడాలని హితవు పలికారు. ఈసీ ప్రస్తావిస్తున్న "తెలంగాణ రక్షణ సమితి (డెమోక్రాటిక్)", "తెలంగాణ రాజ్య సమితి" అనేవి విభిన్న ఉచ్చారణ, గుర్తింపు, నాయకత్వం కలిగిన వేర్వేరు పేర్లని వివరించారు. ఒక్క తెలంగాణలోనే ఇలాంటి రెండు పార్టీలకు గుర్తింపు ఇచ్చినప్పుడు, తమ పార్టీపై అభ్యంతరాలు ఎందుకని ప్రశ్నించారు. దేశంలో ఆమ్ ఆద్మీ, అఖండ్ భారత్, మక్కల్, రాష్ట్రీయ జనతా, శిరోమణి వంటి ఒకే రకమైన సిద్ధాంత, భౌగోళిక పదాలతో వందలాది పార్టీలు రిజిస్ట్రేషన్ పొంది ఉన్న విషయాన్ని లేఖలో గుర్తుచేస్తూ దానికి సంబంధించిన జాబితాను కూడా ఈసీకి జతచేశారు.

**- ఆ ఊహాజనిత అభ్యంతరాలను తిరస్కరించండి**

కేవలం సాధారణ భౌగోళిక వర్ణనలు, ఊహాజనిత సంక్షిప్త రూపాల ఆధారంగా వచ్చిన అభ్యంతరాలన్నింటినీ తోసిపుచ్చాలని కవిత కోరారు. ఇప్పుడు హఠాత్తుగా పేరు మార్చుకోవాలని చెబితే పార్టీగా తాము తీవ్రంగా నష్టపోతామని, అది తమకు అన్యాయం చేయడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 లోని సెక్షన్ 29ఏ కింద తాము చేసుకున్న దరఖాస్తును నిష్పాక్షికంగా, హేతుబద్ధంగా పరిశీలించి పూర్తి కారణాలతో కూడిన స్పష్టమైన ఆదేశాల ద్వారా 'తెలంగాణ రక్షణ సేన' పార్టీ గుర్తింపును ఆమోదించాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆమె విజ్ఞప్తి చేశారు.

## ప్రజల పాపం తగిలి ఫాంహౌస్‌లోనే

రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, కొంత ఆలస్యం జరిగినా ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తామని స్పష్టం చేశారు.తాను ఎంపీగా ఉన్న సమయంలో వంగపల్లి అండర్‌పాస్ కోసం కేంద్రంతో పోరాడి నిధులు తీసుకొచ్చానని కోమటిరెడ్డి వెంకటరెడ్డి గుర్తు చేశారు. ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పనితీరును ప్రశంసిస్తూ ప్రజలు మరోసారి ఆయనను గెలిపిస్తే మంత్రివర్గంలో అవకాశం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కొట్లాడి అయినా బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇప్పిస్తానని ప్రకటించారు. రాజకీయాల్లో పదవుల కోసం పోటీ కాకుండా ప్రజాసేవకే ప్రాధాన్యం ఇవ్వాలని నాయకులకు సూచించారు. ఇక రామన్నపేటలో హ్యామ్ ఫేజ్-1, ప్యాకేజ్-2 కింద రూ.358.18 కోట్లతో 210.10 కిలోమీటర్ల మేర 11 రహదారుల అభివృద్ధి పనులకు కూడా మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ రహదారులు పూర్తి అయితే గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలు మెరుగుపడి రైతులు, విద్యార్థులు, వ్యాపారులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి రహదారి మౌలిక వసతుల నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## సామాన్యుడికి సుప్రీంకోర్టు
## మరింత చేరువ కావాలి

సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ట్రయల్ కోర్టుల్లో పెండింగ్ కేసుల సంఖ్య ఏకంగా 5.05 కోట్లకు చేరిందని ఆయన వివరించారు. ఇందులో దాదాపు 1.1 కోట్ల సివిల్ కేసులు ఉండగా, 3.9 కోట్ల వరకు క్రిమినల్ కేసులు ఉన్నాయి. అదే సమయంలో సుప్రీంకోర్టు సామాన్య ప్రజలకు మరింత అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. నేటికీ చాలామంది సామాన్యులు సుప్రీంకోర్టు అనగానే భయపడుతున్నారని, తమ కేసుల విచారణకు ఏళ్లు పడుతుందేమోనని, ఆర్థిక ఇబ్బందుల వల్ల మంచి లాయర్లను పెట్టుకోలేమేమోనని ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. ఈ అపోహను తగ్గించడానికి ఉచిత న్యాయ సహాయం నాణ్యతను పెంచామని, సీనియర్ లాయర్లను దీని కోసం ఎంపానెల్ చేశామని ఆయన వెల్లడించారు.

**ట్రిబ్యునళ్లపై రిటైర్డ్ జడ్జీలు దృష్టి పెట్టాలి..**

జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ), ఎన్‌సీఎల్టీ, ఐటీఏటీ వంటి ట్రిబ్యునళ్ల పనితీరు, వాటిపై ప్రజల్లో ఉన్న గుర్తింపుపై కూడా సీజేఐ స్పందించారు. కోర్టులపై భారం తగ్గించడానికి, ప్రత్యేక రంగాల వివాదాలను వేగంగా పరిష్కరించడానికి ఈ ట్రిబ్యునళ్లు ఏర్పాటయ్యాయని, వీటి విశ్వసనీయతను కాపాడటం చాలా ముఖ్యమని చెప్పారు. అయితే, ఇటీవల సర్వీస్ నిబంధనల్లో వచ్చిన మార్పుల వల్ల రిటైర్డ్ సుప్రీంకోర్టు, హైకోర్టు జడ్జీలు ఈ ట్రిబ్యునళ్లకు నేతృత్వం వహించడానికి ఆసక్తి చూపించడం లేదని ఆయన సున్నితంగా ప్రస్తావించారు. దేశ సేవగా భావించి ప్రతిభావంతులైన రిటైర్డ్ జడ్జీలు ఈ ట్రిబ్యునళ్ల బాధ్యతలను స్వీకరించాలని తాను కోరుతున్నట్లు సీజేఐ తెలిపారు. ట్రిబ్యునళ్ల నమ్మకత్వం, న్యాయవ్యవస్థ ప్రతిష్ట ఒకదానితో ఒకటి ముడిపడి ఉంటాయని జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు.

## గాల్లోనే ఆవిరైపోతున
## 25శాతం వర్షం

అనే పీర్-రివ్యూడ్ జర్నల్‌లో ప్రచురించారు.దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియను మ్యాప్ చేసే ప్రయత్నంలో పూణే ఫలితం మొదటి అడుగుగా భావిస్తున్నారు. రాజస్థాన్ నుండి వర్షాలతో తడిసిన తీరప్రాంతం వరకు, ఉష్ణోగ్రత, తేమను బట్టి ఈ ప్రక్రియ తీవ్రంగా మారుతుందని అంచనా వేస్తున్నారు. ఐఐటిఎమ్ ఇప్పటికే హిమాలయాల నుండి ఈశాన్యం, పోర్ట్ బ్లెయిర్ వరకు 99 ప్రదేశాలలో వర్షపునీటి-ఐసోటోప్ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తోంది. ఇక్కడ దశాబ్ద కాలంగా నమూనాల సేకరణ జరుగుతోంది.

ఇందులో ఒక వర్షపు బిందువు కిందకు పడుతున్నప్పుడు ఆవిరైపోతే, అది చుట్టుపక్కల గాలి నుండి వేడిని గ్రహించి, మేఘాల దిగువ పొరను చల్లబరుస్తుందని గుర్తించారు.దాదాపు పావు వంతు వర్షపాత నష్టం అనేది ప్రపంచవ్యాప్తంగా ఇతర ప్రాంతాల అంచనాతో పోలిస్తే తక్కువే. ఉపగ్రహ డేటా ఆధారిత కొలతల ప్రకారం, ఉష్ణమండల ప్రాంతాలలో బాష్పీభవనం దాదాపు 20 శాతంగా ఉంది. జ్యూరిచ్‌లో ఇది సుమారు 40 శాతం, బార్బడోస్ సమీపంలో దాదాపు 60 శాతంగా ఉంది. బార్బడోస్‌లోని చిన్న నీటి బిందువులు, పొడి గాలి దీనికి కారణం. బాష్పీభవనం తేలికపాటి వర్షంలోని చిన్న బిందువులను తొలగిస్తుంది, భారీ కుండపోత వర్షంలోని పెద్ద బిందువులను దాదాపుగా ప్రభావితం చేస్తుంది.

# విచ్చలవిడిగా అక్రమ బోర్ల తవ్వకాలు

- పట్టించుకోని స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ అధికారులు
- భూగర్భ జలాలకు పెనుముప్పు అంటున్న స్థానిక ప్రజలు
- సరూర్ నగర్ మండల పరిధిలో అక్రమ బోర్ల నిర్వహకుల స్వైర్య విహారం
- ఒక్కో బోరు వెయ్యి నుంచి రెండువేల అడుగులు తవ్వకం
- ఇలాంటి చర్యలు ప్రకృతికి హాని కలిగించడమే కాక భూకంపాలకు దారితీస్తాయి అంటున్న పరిశోధకులు
- అక్రమ బోర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్
- చైతన్యపురి, బృందావన్ కాలనీలో చెలరేగి బోర్లు వేస్తున్న అక్రమ బోర్ల నిర్వహకులు








ఎల్బీనగర్ (ప్రశ్న న్యూస్) ప్రకృతిని నాశనం చేస్తూ అక్రమ బోర్ల నిర్వహకులు చెలరేగి వెయ్యి నుంచి రెండు వేల అడుగుల వరకు తవ్వకాలు జరుపుతూ రాబోయే రోజుల్లో భూకంపాలకు కారణం కాబోతున్నారు. అసలే భూగర్భ జలాలు ఎండిపోయి ఏం చేయాలో పాలు పోనీ పరిస్థితులలో ఈ అక్రమ బోర్ల నిర్వాహకులు ఇలా చెలరేగి బోర్లు వేయడం వెనుక స్థానిక మండల ఆఫీస్ అధికారుల సహకారం మెండుగా ఉందంటున్నారు స్థానికులు. దీనికి ఉదాహరణ మండల పరిధిలోని బృందావన్ కాలనీలో అక్రమ బోర్ నిర్వాహకులు తాము డిఎస్పి చుట్టాలమంటూ విచ్చలవిడిగా బోర్లు తవ్వి చుట్టుపక్క వాళ్లకి రోజంతా ఇబ్బందికి గురి చేశారు. ప్రశ్నించిన మీడియాని డిఎస్పి పేరుతో బెదిరిస్తూ తమ ఇలాగే చేస్తామని ఎవరు ఏం చేస్తారు అంటూ చెలరేగిపోవడం స్థానికంగా కలకలం సృష్టించింది. అలాగే మరోవైపు ఎలాంటి అనుమతులు లేకుండా చైతన్యపురిలో భారీ ఎత్తున బోర్ తవ్వకం అక్కడ ప్రజల్లో విస్మయం కలిగించింది. ఎమ్మార్వో కార్యాలయ అధికారులకు సమాచారం ఇచ్చిన ఎవరు ఈ అక్రమ బోరు వైపు రాలేదని దీనికి అర్థం ఏంటని ప్రజలు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా అక్రమార్కులకు వంద పడకుండా ఎమ్మార్వో ఆఫీస్ అధికారులు సమాజానికి మేలు చేయాలని వారు తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. తక్షణమే అక్రమంగా వేసిన ఈ రెండు బోర్లను సీజ్ చేయడమే కాకుండా వారిపై ఎఫ్ ఐ ఆర్ నమోదు చేసి కేసు పెట్టి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇట్టి అక్రమ బోర్లపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు వేచి చూడాలి ఒకవేళ అధికారులు స్పందించకపోతే హైకోర్టును ఆశ్రయించి వారి విధులు గుర్తు చేస్తామని ప్రజలు ముక్తకంఠతో చెబుతున్నారు. వాల్టా చట్టాన్ని ఏమాత్రం అమలుపరచకుండా అక్రమార్కులకు వంత పడటం ఏమిటని ప్రజలు నిలదీస్తున్నారు. ఇలాంటి అక్రమ బోర్ల వల్ల శ్వాస కోస సమస్యలతో పాటు ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తుతాయని పర్యావరణ ప్రేమికులు వాపోతున్నారు. బృందావన్ కాలనీలో బోర్ వేసిన సాయి వెంకటేశ్వర బోర్ వెల్స్ బండి నెంబర్ టీఎస్ 12 ఈ హెచ్ 2136 చైతన్యపురిలో అక్రమ బోర్ వేసిన ఎం.వి.ఆర్ బోర్వెల్స్ బండి నెంబర్ టీఎస్ 07 ఎఫ్ వై 0694 ఈ రెండు బోర్ వెల్స్ బండ్లను సీజ్ చేయడమే కాకుండా న్యాయస్థానానికి అప్పగించడం ద్వారా తగిన బుద్ధి చెప్పాలని అలాగే అక్రమంగా బోర్ వేసిన ఇంటి నిర్వాహకుల రిగ్ సీజ్ చేయాలని తద్వారా అక్రమార్కులను కట్టడి చేసి మరొకరు ఈ తప్పు చేయకుండా చూడాలని ప్రజలు ఆశిస్తున్నారు.

## మెకానిక్ షెడ్డులో ప్రమాదవశాత్తు మంటలు..
# ఏడు ప్రైవేట్ బస్సులు దగ్ధం



అమరావతి : విజయవాడ లోని ఆటోనగర్‌లో ఆదివారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి ఏడు ప్రైవేట్ బస్సులు దగ్ధమయ్యాయి. మెకానిక్ షెడ్డులో ఒక బస్సుకు వెల్డింగ్ పనులు చేస్తుండగా మంటలు చెలరేగి సమీపంలోని బస్సులకు వ్యాపించాయి. సిబ్బంది అప్రమత్తమై అగ్నిమాపక శాఖకు ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకున్న మూడు ఫైరింజన్ల మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అప్పటికే గ్యారేజీలో పార్కింగ్ చేసిన ఏడు బస్సులు దగ్ధం మయ్యాయి. మరిన్ని బస్సులకు మంటలు అంటుకోకుండా సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదని అధికారులు వివరించారు.

# రచ్చపల్లిలోని శ్రీసాంబమూర్తి గర్భగుడిలో శ్వేత నాగు ప్రత్యక్షం



ధర్మారం : పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం రచ్చపల్లి గ్రామంలోని శ్రీ సాంబమూర్తి ఆలయంలోకి శ్వేత నాగు ప్రవేశించింది. ఈ ఆలయం కాకతీయుల కాలంలో నిర్మించగా.. భక్తులు దీనిని పునరుద్ధరించి గత దశాబ్దాలుగా శివుడికి నిత్య పూజలు చేస్తున్నారు. ఇక్కడ ప్రతి ఏటా శివరాత్రి సందర్భంగా ఆలయ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వేములవాడ తరహాలో ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తుండగా ఈ ఆలయానికి ఎంతో ప్రతిష్ట ఉంది. ఈ ఆలయంలో నిత్య పూజలు జరుగుతూ ఉంటాయి. ఈ ఆలయంను ఆనుకొని పక్కనే నాగదేవత గుడి ఉండగా.. అందులో ఇప్పటికీ పుట్ట ఉంది. ఈ క్రమంలో ఆలయ పూజారి మామిడిపల్లి శ్రీనివాస చారి రోజు మాదిరిగానే ఆదివారం ఉదయం ఆలయ గర్భగుడి తలుపు తీయగానే శివలింగం పక్కన శ్వేతనాగు ప్రత్యక్షం అయింది. దీంతో ఈ విషయాన్ని చుట్టుపక్కల వారికి ఆయన తెలియడంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు అక్కడికి తరలివచ్చి శ్వేత నాగును చూస్తున్నారు. శివుడి మహిమ వల్లనే ఆలయంలోకి శ్వేత నాగుపాము ప్రవేశించి ఉంటుందని గ్రామస్తులు భావిస్తూ ఓం నమశివాయ అంటూ శివనామ స్మరణ చేస్తున్నారు. శ్వేత నాగును బయటికి పంపకుండా అది స్వయాన గర్భగుడి నుంచి బయటికి వెళ్లే దాకా చూస్తామని గ్రామస్తులు అంటున్నారు. మొత్తం మీద ఎన్నడూ లేని విధంగా ఆలయ గర్భగుడిలోకి శ్వేత నాగు ప్రవేశించడంతో గ్రామంలో సర్వత్రా చర్చ జరుగుతుంది.

# తిరుమలలో స్వామివారి అక్టోబర్ నెల దర్శన కోటా విడుదల



తిరుమల : ఏడుకొండలస్వామి వెంకన్న కొలువుదీరిన తిరుమల లో అక్టోబర్ నెలకు సంబంధించి వివిధ దర్శనాల, గదుల కోటా వివరాలను టీటీడీ విడుదల అధికారులు వెల్లడించారు. తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లయిన సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవ కు సంబంధించిన కోటాను ఈనెల 18న ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సేవా టికెట్లు ఎలక్ట్రానిక్ డిప్ కోసం 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, ఈ టికెట్లు పొందిన వారు 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయని వివరించారు. 21న కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ టికెట్లను ఉదయం 10 గంటలకు, వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తామని తెలిపారు. 23న ఉదయం 10 గంటలకు అంగ ప్రదక్షిణ టోకెన్లు , 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను విడుదల చేస్తామన్నారు. ఈనెల 24న ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలలో గదుల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేస్తామన్నారు. భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జితసేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవాలని కోరారు.

# 'సర్' అప్లికేషన్ పేరుతో మోసం..
## మూడు తులాల పుస్తెలతాడు అపహరణ



బీబీనగర్ : కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ 'సర్' అప్లికేషన్ కోసం ఫొటో తీస్తామని నమ్మించి గుర్తుతెలియని దుండగులు ఓ మహిళకు చెందిన సుమారు మూడు తులాల బంగారు పుస్తెలతాడును అపహరించిన ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ పట్టణ కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. బీబీనగర్ పట్టణానికి చెందిన కుక్కుదోవు అండాలు వద్దకు ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చారు. ప్రభుత్వ 'సర్' అప్లికేషన్ కోసం ఫొటో తీస్తామని చెప్పి, ఫొటోలో ఇబ్బంది కలగకుండా ఉండేందుకు మెడలో ఉన్న పుస్తెలతాడును తీసి భర్తకు ఇవ్వాలని సూచించారు. వారి మాటలు నమ్మిన మహిళ పుస్తెలతాడును తీసి తన భర్త చేతికి ఇచ్చింది. అనంతరం మహిళను ఫొటో తీసిన దుండగులు, అప్లికేషన్‌ను సమీపంలోని ఆలయం వద్ద ఉన్న అధికారుల వద్ద పూర్తి చేయాలని చెప్పి ఆమెను అక్కడి నుంచి కొంత దూరం తీసుకెళ్లారు. ఇదే సమయంలో వెనక్కి తిరిగిన దుండగులు ద్విచక్ర వాహనంపై మహిళ భర్త వద్దకు చేరుకుని అతని చేతిలో ఉన్న బంగారు పుస్తెలతాడును తీసుకుని పరారయ్యారు. మోసపోయినట్లు గుర్తించిన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తూ నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# షాబాద్‌లో ఆరుగురి హత్య కేసు..
## నిందితుడి ఆచూకీపై పోలీసుల ప్రకటన



రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల కేసుపై పోలీసులు కీలక ప్రకటన చేశారు. నిందితుడు రాజ్‌కుమార్ పోలీసుల అదుపులో ఉన్నాడన్న ప్రచారాన్ని చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ ఖండించారు. నిందితుడు మా అదుపులో ఉన్నాడన్న ప్రచారం వాస్తవం కాదని స్పష్టం చేశారు. నిందితుడు చేగూరు రైల్వే ట్రాక్ దాటి అటవీప్రాంతంలోకి వెళ్లినట్లుగా అనుమానిస్తున్నామని డీసీపీ తెలిపారు. రాజ్‌కుమార్ శుక్రవారం రాత్రి 11 .47 గంటలకు తన మొబైల్ స్విచ్ఛాఫ్ చేశాడని పేర్కొన్నారు. రాజ్‌కుమార్ కోసం 8 బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. కాగా, ఆరు హత్యలు జరిగిన 36 గంటలు దాటినా నిందితుడి ఆచూకీని కనిపెట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మరోవైపు ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పిన రాజ్‌కుమార్ ఎక్కడకు వెళ్లాడనేది ఇప్పుడు పెద్ద చిక్కు ప్రశ్నగా మిగిలిపోయింది. నిందితుడి కారు తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో దొరకగా.. మొబైల్ లొకేషన్ కూడా అక్కడే అగిపోయింది. కారును రైల్వే స్టేషన్ సమీపంలో వదిలేసిన రాజ్‌కుమార్ కొత్తూరు మండలం తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ లోపలికి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో రాజ్‌కుమార్ నందిగామలో రైలు ఎక్కాడా.. ఎక్కడితే ట్రైన్ ఎక్కడ దిగాడనేది ఇప్పుడు ప్రశ్నంగా మారింది. కాగా, రాజ్‌కుమార్ ఆచూకీని తెలిపితే రెండు లక్షల రూపాయల రివార్డు ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

## గురుకుల పాఠశాలలో పురుగుల అన్నం..
# పుచ్చిపోయిన కూరగాయలు



గురుకుల పాఠశాలల్లో నిత్యం ఫుడ్‌పాయిజన్ ఘటనలు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం తీరు మారడం లేదు. తాజాగా జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలోని ఓ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు పురుగుల అన్నం, పుచ్చిపోయిన కూరగాయలతో భోజనం వడ్డించిన ఘటన వెలుగులోకి వచ్చింది.

మెట్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గర్ల్స్ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థినులకు పురుగుల అన్నం, పుచ్చిపోయిన కూరగాయలతో భోజనం వడ్డించారు. ఈ గురుకులంలో 530 మంది విద్యార్థినులు ఉండగా.. వారందరికీ నాణ్యత లేని భోజనం పెడుతున్నారని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఈ విషయం బయటకు రావడంతో మీడియా వెళ్లి అడగ్గా.. 'అడగానికి మీరెవరు? మీరు ఎందుకు లోపలికి వచ్చారు?' అంటూ ప్రిన్సిపాల్ డి.మాధురి రెచ్చిపోయారు. ఇప్పటికే గురుకుల పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నప్పటికీ.. ఆహార నాణ్యత పర్యవేక్షణలో అధికారులు తీరు మారడం లేదని తెలంగాణ ప్రజానీకం మండిపడుతున్నారు. కాగా, ఇదే పాఠశాలలో గతంలో ఓ ఉపాధ్యాయుడు బాలికలను శారీరకంగా వేధించడంతో అతనిపై పోక్సో కేసు నమోదవ్వడం అప్పట్లో సంచలనం సష్టించింది.

## కానిస్టేబుల్ పట్టుకున్నది షాబాద్ నిందితుడినేనా..
# ప్రత్యక్ష సాక్షి ఏమన్నాడంటే..



రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో జరిగిన ఆరు హత్యల కేసు నిందితుడు రాజ్‌కుమార్ పోలీసుల అదుపులో ఉన్నాడన్న ప్రచారాన్ని చేవెళ్ల డీసీపీ యోగేశ్ గౌతమ్ ఖండించారని తెలిసిందే. నిందితుడు మా అదుపులో ఉన్నాడన్న ప్రచారం వాస్తవం కాదని స్పష్టం చేశారు. నిందితుడు చేగూరు రైల్వే ట్రాక్ దాటి అటవీప్రాంతంలోకి వెళ్లినట్లుగా అనుమానిస్తున్నామని డీసీపీ తెలిపారు. రాజ్‌కుమార్ శుక్రవారం రాత్రి 11 .47 గంటలకు తన మొబైల్ స్విచ్ఛాఫ్ చేశాడని పేర్కొన్నారు. రాజ్‌కుమార్ కోసం 8 బృందాలు గాలిస్తున్నాయని తెలిపారు. ఇదిలా ఉంటే తిమ్మాపూర్ సమీపంలో నిందితుడు రాజ్‌కుమార్ (అనుమానంతో)ను కానిస్టేబుల్ పట్టుకున్నాడని చెప్పుకొచ్చాడు. ప్రత్యక్ష సాక్షి మాట్లాడుతూ.. ఆయన నడుచుకుంటూ వచ్చి జామకాయ చేతులో పట్టుకుని ఈ చెట్టు దగ్గర నిలబడ్డడు. ఆయన ఒక్కడే ఉన్నడు.. వెంబడి ఎలాంటి వాహనాలు కూడా లేవు. అన్నా టిఫిన్ ఎక్కడుంటది అంటే తిమ్మాపూర్‌లో ఉంటదని చెప్పిన. వేరే బండి ఆపి ఆ బండి మీద వెళ్తున్నడు. అప్పుడే కానిస్టేబుల్ చూడగానే అతడు బండి ఆపి దానిపై నుంచి దూకి ఉరికిండు. కానిస్టేబుల్ అతన్ని వెంబడించి పట్టుకుని వెళ్లిండు. మరి అతడేనా..కాదా..? అనేది తెల్వదన్నాడు. ఇంతకీ మరి పోలీసులు పట్టుకున్నది నిందితుడైన రాజ్‌కుమార్‌నే అయి ఉంటుందా..? లేదా..? అనేది క్లారిటీ రావాల్సి ఉంది. మరోవైపు ఆరు హత్యలు జరిగిన 36 గంటలు దాటినా నిందితుడి ఆచూకీని కనిపెట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. మరోవైపు ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పిన రాజ్‌కుమార్ ఎక్కడకు వెళ్లాడనేది ఇప్పుడు పెద్ద చిక్కు ప్రశ్నగా మిగిలిపోయింది. నిందితుడి కారు తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో దొరకగా.. మొబైల్ లొకేషన్ కూడా అక్కడే అగిపోయింది. కారును రైల్వే స్టేషన్ సమీపంలో వదిలేసిన రాజ్‌కుమార్ కొత్తూరు మండలం తిమ్మాపూర్ రైల్వే స్టేషన్ లోపలికి వెళ్లినట్లు గుర్తించారు. దీంతో రాజ్‌కుమార్ నందిగామలో రైలు ఎక్కాడా.. ఎక్కడితే ట్రైన్ ఎక్కడ దిగాడనేది ఇప్పుడు ప్రశ్నంగా మారింది. కాగా రాజ్‌కుమార్ ఆచూకీని తెలిపితే రెండు లక్షల రూపాయల రివార్డు ఇస్తామని పోలీసులు ప్రకటించారు.

## యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం..
# ధర్మ దర్శనానికి మూడు గంటల సమయం



యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తుల కోలాహలం నెలకొన్నది. ఆదివారం సెలవు దినంతోపాటు వరుస సెలవులు రావడంతో స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ధర్మ దర్శనానికి మూడు గంటల సమయం పడుతుందని భక్తులు తెలిపారు. స్వామివారి నిత్యపూజలు కొనసాగుతున్నాయి. స్వామి వారి కల్యాణ ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కొండపైకి వాహనాలు అధిక సంఖ్యలో రావడంతో కొండ కిందే వాహనాలను నిలిపివేశారు.

# చర్లపల్లి రోడ్డు కబ్జా

**అక్రమ లేఅవుట్లతో ప్రజలను దోచుకున్న దొంగలు**

**లేని ప్లాట్ సృష్టించి ప్రజా రహదారినే అమ్మేశారా.?**

**20 గజాల పేరుతో 30 అడుగుల రోడ్డుపై కబ్జా ఆరోపణలు**

**ఆరేళ్లుగా ఫిర్యాదులు.. అయినా కదలని కాప్రా సర్కిల్ అధికారులు**

**ప్రజా ఆస్తులను కాపాడాలని జ్యోతి లేఅవుట్ వాసుల డిమాండ్**



కాప్రా (ప్రశ్న న్యూస్) చర్లపల్లి గ్రామంలో అక్రమ లేఅవుట్లు, నకిలీ ప్లాట్లు, ప్రజా రహదారుల కబ్జాల వ్యవహారం మరోసారి వెలుగులోకి వచ్చింది. జ్యోతి లేఅవుట్లో అసలు లేని ప్లాట్ను సృష్టించి ప్రజా రహదారి, కామన్ ఏరియాను విక్రయించారని నివాసితులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. ప్రభుత్వ అనుమతులతో ఆమోదం పొందిన లేఅవుట్ను కొందరు తమ స్వప్రయోజనాల కోసం మార్చి ప్రజల హక్కులను కాలరాస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్లు 1, 2, 3, 4లో 3 ఎకరాల 22 గుంటల విస్తీర్ణంలో ఆమోదించబడిన జ్యోతి లేఅవుట్లో మొత్తం 51 ప్లాట్లు మాత్రమే ఉన్నాయి. లేఅవుట్ ప్లాన్ ప్రకారం ప్లాట్ నెం. 51/ఎ అనే ప్లాట్ అసలు లేదని, అయినప్పటికీ అదే పేరుతో 20 చదరపు గజాల ప్లాట్ను సృష్టించి రిజిస్ట్రేషన్ చేసి విక్రయించారని నివాసితులు చెబుతున్నారు. ఈ భూమి వాస్తవానికి ప్రజా రహదారి, కామన్ ఏరియాలో భాగమని వారు పేర్కొంటున్నారు. నివాసితుల ఆరోపణల ప్రకారం, ఈ వివాదాస్పద రిజిస్ట్రేషన్ పత్రాన్ని ఆధారంగా చేసుకుని ప్రజలు వినియోగించే 30 అడుగుల రహదారిని క్రమంగా ఆక్రమించారు. దీంతో కాలనీలోని పలువురు ప్లాట్ యజమానులు, స్థానిక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అత్యవసర పరిస్థితుల్లో



అంబులెన్స్, అగ్నిమాపక వాహనాలు సైతం వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై 2020 నుంచే సంబంధిత అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని నివాసితులు ఆరోపిస్తున్నారు. రాజకీయ పలుకుబడి, అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఆక్రమణలు పెరుగుతూ వచ్చాయని విమర్శిస్తున్నారు.

ప్రజా ఆస్తులపై కబ్జాలు జరుగుతున్నా అధికారులు మౌనం పాటించడం అనుమానాలకు తావిస్తోందని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇదే ఆక్రమణలను శాశ్వతం చేసే ప్రయత్నంలో భాగంగా అనుమతులు లేకుండా మతపరమైన నిర్మాణం కూడా చేపట్టారని ఆరోపణలు ఉన్నాయి.

అయితే హైకోర్టు జోక్యంతో మున్సిపల్ అధికారుల చర్యలతో ఆ అక్రమ నిర్మాణం ఇటీవల కూల్చివేయబడింది. అయినప్పటికీ అసలు సమస్య అయిన ప్రజా రహదారి, కామన్ ఏరియాపై కొనసాగుతున్న ఆక్రమణలు మాత్రం ఇంకా తొలగించలేదని నివాసితులు అంటున్నారు. ప్రజా రహదారులు, కామన్ స్థలాలు ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదని, వాటిని ఆక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జ్యోతి లేఅవుట్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. వివాదాస్పద రిజిస్ట్రేషన్ పత్రాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆమోదిత లేఅవుట్ను యథాతథ స్థితికి తీసుకురావాలని వారు కాప్రా సర్కిల్ అధికారులు, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ను కోరుతున్నారు. ప్రజా ఆస్తులను కాపాడటంలో అధికారులు ఇకనైనా కఠిన వైఖరి అవలంబించాలనే డిమాండ్ స్థానికుల నుండి బలంగా వినిపిస్తోంది.

## స్నేహితుడి వద్ద వెయ్యి అప్పు తీసుకున్న వ్యక్తి..

## 35 ఏళ్ల తర్వాత వడ్డీతో సహా తిరిగి చెల్లింపు





తిరువనంతపురం: ఒక వ్యక్తి తన స్నేహితుడి వద్ద రూ.1,000 అప్పుగా తీసుకున్నాడు. ఆ తర్వాత వారిద్దరి మధ్య ఎలాంటి సంప్రదింపులు లేకపోవడంతో ఆ డబ్బు తిరిగి ఇవ్వలేకపోయాడు. 35 ఏళ్ల తర్వాత స్నేహితుడి అడ్రస్ తెలుసుకుని అతడి ఇంటికి వెళ్లి వడ్డీతో సహా తిరిగి చెల్లించాడు. (ఖవతీఖశ్రీఖ మీఖఅ =వీబతీఅం వీశీఅవఎ) కేరళకు చెందిన ఇస్మాయిల్ 1991లో సౌదీ అరేబియాలోని అబ్కైక్లో పని చేశాడు. లచ్చన్నతో పాటు మరో ముగ్గురితో కలిసి అతడు నివసించాడు. సుమారు ఐదేళ్లు వారంతా కలిసి ఉన్నారు.కాగా, సహోద్యోగి, స్నేహితుడైన లచ్చన్న నుంచి ఇస్మాయిల్ 120 సౌదీ రియాల్స్ (నాడు రూ.1,000 విలువ) అప్పుగా తీసుకున్నాడు. తనకు వీలైనప్పుడు ఆ డబ్బు తిరిగి చెల్లిస్తానని అతడు మాట ఇచ్చాడు. ఆ తర్వాత కొంత కాలానికి లచ్చన్న భారత్కు తిరిగి వచ్చాడు. అప్పట్లో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా అందుబాటులో లేకపోవడంతో వారిద్దరి మధ్య సంబంధం తెగిపోయింది. కొంత కాలానికి ఇస్మాయిల్ కూడా కేరళకు తిరిగి చేరుకున్నాడు.మరోవైపు లచ్చన్న నుంచి ఇస్మాయిల్ తీసుకున్న వెయ్యి పెద్ద మొత్తం కానప్పటికీ ఇచ్చిన మాట మేరకు తిరిగి ఇవ్వాలని ఆయన నిర్ణయించుకున్నాడు. అయితే లచ్చన్న వివరాలు తెలియకపోవడంతో వెంటనే సాధ్యం కాలేదు. తెలంగాణలోని జగిత్యాల జిల్లా ధర్మపురికి లచ్చన్న చెందినవాడన్న విషయం మాత్రమే ఇస్మాయిల్కు గుర్తుంది. దీంతో ధర్మపురి గురించి ఆన్లైన్లో సమాచారం తెలుసుకున్నాడు. ఆ ఊరికి చేరుకున్న తర్వాత లచ్చన్న గురించి స్థానికులను ఆరా తీశాడు.చివరకు జూలై 9న ఇస్మాయిల్ అన్వేషణ ఫలించింది. లచ్చన్న ఇంటి అడ్రస్ తెలుసుకుని అక్కడకు వెళ్లాడు. లచ్చన్న గల్ఫ్ దేశంలో పనిచేస్తున్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలుసుకున్నాడు. వారి మొబైల్ ఫోన్ నుంచి వాట్సాప్ కాల్లో తన పాత స్నేహితుడితో ఇస్మాయిల్ మాట్లాడాడు. అంతేగాక 35 ఏళ్ల కిందట తీసుకున్న రూ.1000కి వడ్డీతో కలిపి మొత్తం రూ.25,000 లచ్చన్న కుటుంబానికి అందజేశాడు.అయితే ఇస్మాయిల్ చాలా నిజాయితీపరుడని, మంచి మనసున్న మనిషని లచ్చన్న కొనియాడాడు. 35 ఏళ్ల కిందట తన నుంచి అప్పుగా తీసుకున్న సుమారు వెయ్యికి వడ్డీ కలిపి రూ.25,000 తిరిగి ఇవ్వడం పట్ల ఆశ్చర్యపోయినట్లు చెప్పాడు. ఇన్ని ఏళ్ల తర్వాత కూడా మాట నిలబెట్టుకున్నందుకు ఇస్మాయిల్కు కృతజ్ఞతలు తెలియజేశాడు. తమ మధ్య ఉన్న స్నేహ బంధానికి ఇది నిదర్శమని లచ్చన్న ప్రశంసించాడు.

## మహిళ ఇంట్లోకి చొరబడిన డెలివరీ వ్యక్తి..

## ప్రైవేట్ పార్ట్ చూపించడంతో అరెస్ట్



బెంగళూరు: ఒక డెలివరీ ఏజెంట్ మహిళ ఇంట్లోకి బలవంతంగా చొరబడ్డాడు. అర్జెంట్ అంటూ బాత్రూమ్లోకి వెళ్లాడు. బయటకు వచ్చిన అతడు తన ప్రైవేట్ పార్ట్ను ఆ మహిళకు చూపించాడు. బాధిత మహిళ దీనిని రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసి వాపోయింది. ఈ నేపథ్యలో ఆ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. (ణవశ్రీఅజవతీఎ ఝఅ టశ్రీఖంప్త్రవం ఫ ఔశీఝఅ) కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. శనివారం సాయంతరం మారతహల్లి ప్రాంతంలోని ఒక అపార్ట్మెంట్కు ఆర్డర్ డెలివరీ కోసం ఫ్లిప్కార్ట్ డెలివరీ ఎగ్జిక్యూటివ్ వెళ్లాడు. తనకు అర్జెంట్ అంటూ ఒక మహిళ ఇంట్లోకి చొరబడ్డాడు. బాత్రూమ్ వినియోగించుకుని బయటకు వచ్చిన అతడు తన ప్రైవేట్ పార్ట్ను ఆమెకు చూపించాడు. ఆ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె ప్రతిఘటించడంతో అక్కడి నుంచి పారిపోయాడు. కాగా, ఆ మహిళ ఈ సంఘటనను రికార్డ్ చేసింది. ఈ వీడియో క్లిప్ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసి తన ఆవేదన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో ఇది పోలీసుల దృష్టికి వెళ్లింది. బాధిత మహిళతో పోలీసులు మాట్లాడి ఫిర్యాదు తీసుకున్నారు. ఫ్లిప్కార్ట్ డెలివరీ ఎగ్జిక్యూటివ్ను 22 ఏళ్ల విజయ్ మల్లికార్జున్ కామత్గా గుర్తించారు. ఆదివారం అతడ్ని అరెస్ట్ చేశారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మరోవైపు ఈ సంఘటనపై ఫ్లిప్కార్ట్ స్పందించింది. దీని పట్ల తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది. ఆ డెలివరీ ఏజెంట్ను తొలగించినట్లు పేర్కొంది.

# ప్రజావాణి పేరుకు తూట్లు

**- ఆదివాసీల గోడు ఎవరికి వినిపించదా.?**








ములుగు (ప్రశ్న న్యూస్) ప్రజా సమస్యల పరిష్కార వేదికగా చెప్పుకునే ములుగు జిల్లా కలెక్టరేట్లోని ప్రజావాణి కార్యక్రమం ఆదివాసీలకు మాత్రం నిరాశనే మిగులుస్తోంది. ప్రతి సోమవారం 100 కిలోమీటర్లకు పైగా ప్రయాణించి వస్తున్నా సమస్యలకు పరిష్కారం దొరకక ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కేంద్రం చుట్టుపక్కల ఉన్న గిరిజనేతరులు నేరుగా కలెక్టరేట్కు వస్తుండగా, ఏటూరు నాగారం ఐటీడీఏ పరిధిలోని ఆదివాసీ గిరిజనులు మాత్రం ఏటూరు నాగారం, కన్నాయి గూడెం, వాజేడు, మంగపేట, తాడ్వాయి, వెంకటాపూర్ మండలాల నుండి తెల్లవారుజామునే బయలుదేరి వస్తున్నారు. బస్సు, ఆటో ఛార్జీలకు రూ. 400 నుండి 500 వరకు ఖర్చు చేస్తున్నారు.

### ఫిర్యాదు ఇస్తే ఫైలుకే పరిమితం..

ఉదయం 10 గంటలకే కలెక్టరేట్ ఆవరణ ఆదివాసీలతో నిండిపోతోంది. పోడు భూములకు పట్టాలు, పెన్షన్లు, రేషన్, ఇందిరమ్మ ఇళ్లు వంటి సమస్యలతో వినతి పత్రాలు అందజేస్తున్నారు. కానీ ఫిర్యాదు తీసుకున్న తర్వాత సంబంధిత శాఖకు పంపుతామని చెప్పడం తప్పితే, ఆ తర్వాత ఏమైందో తెలియజేసే వ్యవస్థ లేదు. నెలల తరబడి తిరిగినా ఫలితం శూన్యంగా ఉంటోంది.

**"ప్రజావాణి అంటేనే ఇప్పుడు విసుగు వస్తోంది" అని ఆదివాసీలు వాపోతున్నారు.**

### ఐటీడీఏ నామమాత్రంగా మారింది

ఆదివాసీల సర్వతోముఖ అభివృద్ధికి ఉండాల్సిన ఐటీడీఏ నేడు పనికి రాని సంస్థగా మిగిలిపోయిందని బిఆదివాసీ నవ నిర్మాణ రాష్ట్ర అధ్యక్షుడు కోర్స నరసింహమూర్తిబి ఆరోపించారు.

"ప్రధాన శాఖలన్నీ ఖాళీ కుర్చీలతో దర్శనం ఇస్తున్నాయి. ప్రాజెక్ట్ అధికారి ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ చూపడం లేదు. గిరిజనేతరుల సమస్యలు త్వరగా పరిష్కారం అవుతున్నాయి, ఆదివాసీల ఫైళ్లు మాత్రం మూలన పడుతున్నాయి. పోడు భూములకు పట్టాలు ఇవ్వరు, పెన్షన్లు ఇవ్వరు. అధికారులు నిబద్ధతతో పని చేయాలి. లేకుంటే కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం" అని హెచ్చరించారు. వెంకటాపురం, వాజేడు మండలాల్లో ఉపాధ్యాయులు లేని పాఠశాలలు అనేకం ఉన్నాయని, ఎన్నిసార్లు అడిగినా ఉపాధ్యాయులను పంపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**స్వార్థం కోసం ప్రజావాణి వినియోగం..**

ఈ గ్యాప్ను కొందరు అక్రమార్కులు వాడుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. పలుకుబడి ఉన్నవారి ఫిర్యాదులను అధికారులు ప్రాధాన్యతగా తీసుకుంటుండగా, సుదూర ప్రాంతాల నుండి వచ్చే ఆదివాసీల సమస్యలు మాత్రం పెండింగ్లోనే ఉంటున్నాయి. అధికారులు ప్రజావాణిని తూతు మంత్రంగా నిర్వహిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.

### రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ ఆగ్రహం..

ఈ అంశంపై బితుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్బి తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వం గిరిజన సంక్షేమం గురించి గొప్పగా మాట్లాడుతుంది. కానీ క్షేత్ర స్థాయిలో ఆదివాసీలకు అన్యాయం జరుగుతోంది.




ఐటీడీఏ ఒక పేరుకే పరిమితమైంది. షెడ్యూల్ ప్రాంతంలోని 29 శాఖల్లో ఉన్న ఉద్యోగాలను ఏజెన్సీ సర్టిఫికెట్ ఉన్న ఏజెన్సీ అభ్యర్థుల ద్వారానే ఐటీడీఏ నోటిఫికేషన్ ఇచ్చి భర్తీ చేయాలి. ఇది భారత రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్ లో స్పష్టంగా పేర్కొన్నారు.

కానీ అధికారులు దీన్ని పట్టించుకోవడం లేదు. ఆదివాసీల పోడు భూములు, పెన్షన్లు, విద్య సమస్యలను వెంటనే పరిష్కరించాలి. లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆదివాసీలతో కలిసి ఉద్యమం తీవ్రం చేస్తాంలి అని ఆయన హెచ్చరించారు.

### 15 రోజుల్లో పరిష్కారం చూపాలి..

ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో మాత్రం న్యాయం జరగడం లేదు. కలెక్టర్ స్వయంగా ప్రతి సోమవారం ఐటీడీఏ పరిధి ఫిర్యాదులపై ప్రత్యేక సమీక్ష చేసి, 15 రోజుల్లో పరిష్కారం చూపితేనే ప్రజావాణికి సార్థకత ఉంటుందని ఆదివాసీలు కోరుతున్నారు.

**ఆదివాసీల ప్రధాన డిమాండ్లు..**

- పోడు భూములకు వెంటనే పట్టాలు ఇవ్వాలి
- పెన్షన్లు, రేషన్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి
- ఐటీడీఏలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి
- వెంకటాపురం, వాజేడులో టీచర్ల కొరతను తీర్చాలి

## ప్రాజెక్టులపై చిత్తశుద్ధి ఉంటే చర్చకు సిద్ధమా ?

## మంత్రి ఉత్తమ్కు జగదీష్ రెడ్డి సవాల్



హైదరాబాద్ : కాళేశ్వరం ప్రాజెక్టు పై ముఖ్యమంత్రి, మంత్రులు అవగాహన లేకుండా మూర్ఖంగా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణ భవన్లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. కన్నెపల్లి పంపు హౌస్ నుంచి నీళ్లు వదిలితే రాష్ట్రాన్ని కరువు బారి నుంచి కాపాడుకోవచ్చని హితవు పలికారు.ప్రాజెక్టులపై, రైతులపై చిత్తశుద్ధి ఉంటే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. గంధమళ్ళ, బస్వాపూర్ నుంచి మొదలుపెట్టి కొండపోచమ్మ, మల్లన్న సాగర్, అప్పర్ మానేర్, మిడ్ మానేర్, అన్నపూర్ణ, రంగనాయక్ సాగర్, సుందిళ్ల, ఎస్సారెస్పీ, అన్నారం బ్యారేజీ నీళ్లు మొత్తం తీసుకుపోయి గోదావరిలో ఒక్కదగ్గర పోసినా కూడా భద్రాచలానికి ఏమీ కాదని పేర్కొన్నారు. నీటిని స్టోరేజీ చేస్తే భద్రాచలం మునిగిపోతుందని చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాదనలను తిప్పికొట్టారు. ఇప్పటికైనా జ్ఞానం తెచ్చుకొని వెంటనే కన్నెపల్లి పంప్ హౌస్ ప్రారంభించాలని సూచించారు. సూపర్ ఎల్ నినో ప్రభావంతో రానున్న రెండు సంవత్సరాల వరకు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఎదురయ్యే అవకాశముండడంతో రిటైర్డ్ ఇంజనీర్లు కన్నెపల్లి పంపు హౌజ్ నుంచి నీళ్లు విడుదల చేయవచ్చని సలహాలిస్తే వారిని జైలులో వేస్తానని అనడం శోచనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని అనడానికి షాబాద్ ఘటనే నిదర్శనమని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఇలాంటి సీరియల్ క్రైమ్స్ కనిపించలేదని వెల్లడించారు. నేరం చేయాలంటేనే వణుకు పుట్టేలా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం భూ ఆక్రమణల మీదే శ్రద్ధ పెడుతూ మిగతా విషయాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు.

# ఆరోగ్యమే మహాభాగ్యం..

## ఉచిత వైద్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి

**- నెక్కలం గొల్లగూడెంలో మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించిన: మాజీ మంత్రి జోగి రమేష్**



నెక్కలం గొల్లగూడెం (ప్రశ్న న్యూస్) నూజివీడు నియోజకవర్గంలోని నెక్కలం గొల్లగూడెం గ్రామంలో యేసుక్రీస్తు సర్వజనుల ప్రార్థన మందిరం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మాజీ మంత్రి జోగి రమేష్ ప్రారంభించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో బెజవాడ పంగిడయ్య, రజని ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన వైద్య నిపుణులు పాల్గొని గ్రామస్తులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలు అందించారు. రోగుల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ, ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తిస్తే మెరుగైన చికిత్సతో పాటు ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని తెలిపారు. సమాజ సేవా దృక్పథంతో ముందుకు వచ్చి వైద్య శిబిరాన్ని నిర్వహించిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ప్రజల ఆరోగ్య సంరక్షణలో స్వచ్ఛంద సంస్థలు, సేవా సంస్థల పాత్ర ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వైద్య బృందం, ప్రార్థన మందిర నిర్వాహకులు, సేవా కార్యక్రమ నిర్వాహకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన వారికి ఆరోగ్య అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన వైద్య సూచనలు అందించారు.

# ధవళేశ్వరానికి నవశకం

**117 వరద గేట్ల మార్పిడికి నేడు సీఎం చంద్రబాబు శ్రీకారం**

**రూ.152.95 కోట్లతో బ్యారేజీ ఆధునీకరణ.**

**గోదావరి డెల్టా సాగునీటి భద్రతకు చారిత్రక ముందడుగు**



ధవళేశ్వరం(ప్రశ్న న్యూస్)గోదావరి డెల్టాకు ప్రాణాధారంగా, ఉభయ గోదావరి జిల్లాల వ్యవసాయాభివృద్ధికి జీవనాడిగా నిలిచిన ధవళేశ్వరం సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ మరో చారిత్రక మైలురాయికి చేరుకుంది. దాదాపు నాలుగు దశాబ్దాలుగా సేవలందిస్తున్న బ్యారేజీని ఆధునికీకరించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రూ.152.95 కోట్ల వ్యయంతో 117 పాత వరద గేట్ల స్థానంలో అత్యాధునిక గేట్ల ఏర్పాటుకు సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని పిచ్చుకలంక వద్ద గేట్ నంబర్--1 సమీపంలో ఈ కార్యక్రమం జరగనుంది.ఈ ప్రాజెక్టు కేవలం గేట్ల మార్పిడి మాత్రమే కాకుండా, గోదావరి డెల్టా భవిష్యత్ సాగునీటి భద్రతకు ప్రభుత్వం చేపడుతున్న దీర్ఘకాలిక ప్రణాళికగా అధికారులు అభివర్ణిస్తున్నారు. లక్షలాది ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, కోట్లాది ప్రజలకు తాగునీరు అందిస్తున్న ఈ బ్యారేజీ ఆధునీకరణతో వరద నియంత్రణ సామర్థ్యం మరింత పెరుగుతుందని చెబుతున్నారు.కాటన్ కలలకు కొనసాగింపు1847లో ప్రారంభమై 1852లో పూర్తయిన ధవళేశ్వరం ఆనకట్ట గోదావరి జలాలను వ్యవసాయానికి మళ్లించి డెల్టా ప్రాంతాన్ని దేశంలోనే అత్యంత సారవంతమైన భూభాగంగా మార్చింది. బ్రిటిష్ ఇంజనీర్ సర్ ఆర్థర్ కాటన్ దూరదృష్టితో నిర్మించిన ఈ ఆనకట్ట రైతాంగానికి వరప్రసాదంగా మారింది. ఆయన సేవలకు గుర్తింపుగా గోదావరి రైతులు ఇప్పటికీ కాటన్‌ను కృతజ్ఞతతో స్మరించుకోవడం విశేషం.1963 వరదల అనంతరం ఆధునిక అవసరాలకు అనుగుణంగా కొత్త బ్యారేజీ నిర్మాణం చేపట్టగా, 1969లో ప్రారంభమైన నిర్మాణం 1984లో పూర్తయింది. ప్రస్తుతం 5.837 కిలోమీటర్ల పొడవున్న ఈ బ్యారేజీ సుమారు 10.13 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతో పాటు, లక్షలాది మందికి తాగునీటి ప్రధాన వనరుగా కొనసాగుతోంది.కాలానికి తగ్గ ఆధునీకరణనాలుగు దశాబ్దాలుగా నిరంతర వినియోగం, వరదల ఒత్తిడి, యాంత్రిక భాగాల శిథిలీకరణతో బ్యారేజీ నిర్వహణపై కేంద్ర జల సంఘం, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్, హైడ్రో-మెకానికల్ నిపుణుల కమిటీలు పలుమార్లు పరిశీలనలు నిర్వహించాయి. వారి సిఫార్సుల మేరకు రాష్ట్ర ప్రభుత్వం బ్యారేజీ సమగ్ర ఆధునీకరణకు శ్రీకారం చుట్టింది.ధవళేశ్వరం బ్యారేజీ ఆధునీకరణతో గోదావరి డెల్టా చరిత్రలో మరో కీలక అధ్యాయం ప్రారంభమవుతుండగా, రైతాంగ భవిష్యత్తుకు ఇది శాశ్వత భరోసాగా మారుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

# ప్రభుత్వ విప్ దయాకర్ వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఆగ్రహం

**వెంటనే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని**

**ఎన్ సి సంతోష్ కుమార్ గుప్తా డిమాండ్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )ప్రభుత్వ విప్ దయాకర్ మాజీ మంత్రి హరీష్ రావుపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని గజ్వేల్ బీఆర్ఎస్ నాయకుడు ఎన్.సి. సంతోష్ కుమార్ గుప్తా అన్నారు. శాసనమండలి ప్రభుత్వ విప్‌గా బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి అసభ్యకర వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని విమర్శించారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ సభ్యులు క్రమశిక్షణ పాటించేలా చూడాల్సిన బాధ్యత ఉన్న దయాకర్ ఆ బాధ్యతను విస్మరించి బీఆర్ఎస్ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. వెంటనే ఆయనను ప్రభుత్వ విప్ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.హరీష్ రావు రాజకీయ స్థాయి, ప్రజాసేవ పట్ల ఆయన నిబద్ధత రాష్ట్ర ప్రజలకు బాగా తెలుసని, దయాకర్ తన హద్దులు దాటి మాట్లాడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా తన భాషపై నియంత్రణ పాటించేలా కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్రంలో రాజకీయ సంస్కృతి దిగజారుతోందని, అసభ్యకర వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి మంచివి కావని అన్నారు. ఇలాంటి రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో ప్రజలే సమాధానం చెబుతారని పేర్కొన్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడాల్సిన ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కాంగ్రెస్ పార్టీ తన నాయకుల ప్రవర్తనను సరిదిద్దుకోకపోతే తీవ్ర రాజకీయ పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎన్.సి. సంతోష్ కుమార్ గుప్తా హెచ్చరించారు.

# వంశధారకు జలహారతి పలాసలో కాలువ వద్ద పూజలు నిర్వహించిన-ఎమ్మెల్యే గౌతు శిరీష



పలాస(ప్రశ్న న్యూస్) హిరమండలం రిజర్వాయర్ నుంచి విడుదలైన వంశధార జలాలు పలాస మండలం టెక్కలి ప్రధాన కాలువలోకి చేరడంతో రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. కాలువలో పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్న నీటికి పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదివారం జలహారతి ఇచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులతో కలిసి కాలువ వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి, ఉత్సాహ వాతావరణంలో సాగింది. వంశధార జలాలకు పూలతో హారతులు ఇచ్చిన ఎమ్మెల్యే, పలాస ప్రాంత రైతుల పొలాలకు సమృద్ధిగా సాగునీరు చేరి ఖరీఫ్ పంటలు బాగా పండాలని ఆకాంక్షించారు. కాలువ గట్టుపై పెద్ద సంఖ్యలో రైతులు, మహిళలు, పార్టీ శ్రేణులు పాల్గొని జలహారతిలో భాగస్వాములయ్యారు. కాలువలో ప్రవహిస్తున్న నీటిని స్థానికులు ఆనందంగా వీక్షించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గౌతు శిరీష మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా పలాస ప్రాంత రైతులకు వంశధార ఏడో కాలువ ద్వారా సాగునీరు అందిస్తున్న ఘనత ఎన్డీయే ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ రైతులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుని సాగునీటిని అందించిందన్నారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి సిదిరి అప్పలరాజుపై విమర్శలు గుప్పించారు. “గత ప్రభుత్వంలో నాలుగేళ్లు మంత్రిగా ఉన్నప్పటికీ పలాస రైతులకు ఒక్క చుక్క వంశధార నీటిని కూడా తీసుకురాలేకపోయారు. ఇప్పుడు విమర్శలు చేయడం సరికాదు” అంటూ వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వ పనితీరుకు, ప్రస్తుత ప్రభుత్వ చర్యలకు మధ్య ఉన్న తేడాను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, సాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాలు లేకున్నా రైతుల పంటలు ఎండిపోకుండా సాగునీరు అందించడం ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు.పలాస ప్రాంతానికి వంశధార జలాలు చేరేలా చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుకు ఎమ్మెల్యే ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.వంశధార జలాలు కాలువలోకి చేరడంతో ఖరీఫ్ సాగుపై ఆశలు పెరిగాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గానకోకిల మౌనమైంది ఎస్. జానకమ్మకు నివాళి అర్పించిన- డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

**దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచానికి తీరని లోటు**



దర్శి(ప్రశ్న న్యూస్) దక్షిణ భారత సినీ సంగీత ప్రపంచాన్ని తన మధుర గానామృతంతో దశాబ్దాల పాటు అలరించిన దిగ్గజ గాయని, పద్మభూషణ్ పురస్కార గ్రహీత ఎస్. జానకమ్మ మరణం పట్ల దర్శి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జానకమ్మ మరణం భారతీయ సంగీత ప్రపంచానికే తీరని లోటని ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన సంతాప సందేశంలో ఆమె మాట్లాడుతూ, పలు భారతీయ భాషల్లో వేలాది పాటలు ఆలపించి తన అపూర్వ గాన ప్రతిభతో కోట్లాది సంగీతాభిమానుల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న జానకమ్మ, దక్షిణ భారత గానకోకిలగా చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. తెలుగు సినీ సంగీతానికి ఆమె చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామంలో జన్మించిన జానకమ్మ, తెలుగు రాష్ట్రాలకు గర్వకారణమని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పేర్కొన్నారు. ఆమె స్వరం తరతరాల సంగీత ప్రియులను అలరిస్తూనే ఉంటుందని, ఆమె పాడిన పాటలు చిరకాలం ప్రజల హృదయాల్లో మారుమోగుతూనే ఉంటాయని అన్నారు.“జానకమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. ఆమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను” అని డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తన సంతాప సందేశంలో పేర్కొన్నారు.

# పలాస విమానాశ్రయానికి ప్రజల సహకారమే కీలకం

**- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు**

**-ఉద్దానం అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్ గేమ్‌చేంజర్: కేంద్ర మంత్రి**

**-నిర్వాసితులకు చట్టబద్ధ నష్టపరిహారం హామీ..**



బిడిమి (ప్రశ్న న్యూస్) మందస ఉద్దానం ప్రాంత అభివృద్ధికి పలాస విమానాశ్రయ నిర్మాణం కీలకమని, ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు విజయవంతం కావాలంటే స్థానిక ప్రజలు సహకరించాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పిలుపునిచ్చారు. మందస మండలం బిడిమి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.పలాస ప్రాంతంలో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందని మంత్రి తెలిపారు. విమానాశ్రయం నిర్మాణం పూర్తయితే ఉద్దానం ప్రాంతానికి కొత్త పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే అవకాశాలు పెరుగుతాయని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు గణనీయంగా విస్తరిస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు ప్రాంత ఆర్థికాభివృద్ధికి మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.భూములు కోల్పోయే రైతులు, నిర్వాసితులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. చట్టప్రకారం అర్హులైన ప్రతి ఒక్కరికీ తగిన నష్టపరిహారం, పునరావాసం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పారదర్శకంగా అన్ని ప్రక్రియలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు.విమానాశ్రయం నిర్మాణం వల్ల రవాణా రంగం బలోపేతం కావడంతో పాటు పర్యాటకం, వాణిజ్యం, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు కొత్త అవకాశాలు లభిస్తాయని మంత్రి వివరించారు. ఉద్దానం ప్రాంత భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ ఈ ప్రాజెక్టుకు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, ఉద్దానం ప్రాంత రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమావేశంలో ప్రజలు తమ సందేహాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, వాటిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని అధికారులు తెలిపారు.

# నంద్యాలలో ఉచిత క్యాన్సర్ పరీక్షలు

**బసవతారకం ఆస్పత్రి సహకారంతో మెగా వైద్య శిబిరం**

**హీరో బాలకృష్ణకు కృతజ్ఞతలు తెలిపిన: ఎంపీ బైరెడ్డి శబరి**



నందికొట్కూరు(ప్రశ్న న్యూస్) నంద్యాల జిల్లా ప్రజలకు నాణ్యమైన క్యాన్సర్ వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి సహకారంతో భారీ ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. ఈ కార్యక్రమానికి అంగీకరించి సహకరించిన సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు జిల్లా ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.నందికొట్కూరు నియోజకవర్గంలోని పగిడ్యాల మండలం నెహ్రూనగర్‌లో ఆదివారం నిర్వహించిన మెగా క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి, రాయలసీమ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఒక్కో పరీక్షకు సుమారు రూ.15 వేల విలువైన క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను ప్రజలకు ఉచితంగా అందించారు.ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఇటీవల విజయవాడలో బాలకృష్ణను కలిసినప్పుడు నంద్యాల జిల్లాలో క్యాన్సర్ బాధితుల సంఖ్య ఎక్కువగా ఉందని వివరించగా, వెంటనే స్పందించిన ఆయన ఉచిత వైద్య శిబిరాల నిర్వహణకు అంగీకరించి, ప్రత్యేక వైద్య బృందంతో పాటు అత్యాధునిక పరీక్షల పరికరాలను అందుబాటులో ఉంచారని తెలిపారు. ప్రజల ఆరోగ్యంపై బాలకృష్ణ చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.నెహ్రూనగర్‌లో తొలి శిబిరం నిర్వహించడానికి మాజీ గ్రామ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు, బాలకృష్ణ అభిమాని కట్టుబడి శ్రీనివాసనాయుడు చేసిన కృషి కారణమని ఎంపీ చెప్పారు. ఈ శిబిరం ద్వారా పరిసర ప్రాంతాల పది గ్రామాల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని తెలిపారు.వైద్య శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై పరీక్షలు చేయించుకున్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన బసవతారకం ఆస్పత్రి వైద్య బృందం, స్థానిక వైద్యులు, వాలంటీర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు సేవలందించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగేశ్వరరావు, మాజీ మున్సిపల్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, నందికొట్కూరు బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు తిమ్మారెడ్డి, బీఎస్ఎన్ఎల్ సలహా కమిటీ సభ్యుడు కురువ రమేష్, టీడీపీ నాయకులు వెంకటేశ్వరశర్మ, బంగారు వెంకటేశ్వర్లు, గుణశేఖర్ రెడ్డి, రఘురామిరెడ్డి, పారుమంచాల కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రంగాయిపల్లిలో వంటేరు ప్రతాప్ రెడ్డి నిరాహార దీక్ష

**“ఎంఎస్ అగర్వాల్ కంపెనీని వెంటనే తొలగించాలి..**

**ప్రజల ప్రాణాలను కాపాడాలి”**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) మనోహరాబాద్ మండలం రంగాయిపల్లి గ్రామంలో ఎంఎస్ అగర్వాల్ ఫౌండ్రీస్ కంపెనీని వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి నిరాహార దీక్ష చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “ఎంఎస్ అగర్వాల్ కంపెనీ హటావో... రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాలను బచావో” అంటూ నినాదాలు చేశారు. కంపెనీ వల్ల వెలువడుతున్న విషపూరిత కాలుష్యంతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రజల ఆరోగ్యాలు, ప్రాణాలను కాపాడేందుకు కంపెనీని తొలగించే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు.గత 20 ఏళ్లుగా కంపెనీ కాలుష్యం కారణంగా వందలాది మంది మృతి చెందగా, వేలాది మంది అనారోగ్యానికి గురయ్యారని ఆరోపించారు. కంపెనీ యాజమాన్యం లాభాల కోసం ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని విమర్శించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజాభిప్రాయ సేకరణను కంపెనీ ప్రాంగణంలో కాకుండా గ్రామ నడిబొడ్డున నిర్వహించాలని కోరారు. పార్టీలకు అతీతంగా ప్రజలంతా ఏకమై కంపెనీ తొలగింపు కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పరిశ్రమల శాఖ మంత్రి గ్రామాలకు వచ్చి కాలుష్యం వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. తన నిరాహార దీక్షను అడ్డుకునేందుకు ఒత్తిళ్లు తీసుకువచ్చినా, ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని, కంపెనీ తొలగించే వరకు ఉద్యమం కొనసాగుతుందని వంటేరు ప్రతాప్ రెడ్డి ప్రకటించారు.అలాగే, భారీ సంఖ్యలో పోలీసులను మోహరించడం దురదృష్టకరమని, స్థానిక ప్రజలపై కేసులు నమోదు చేయించడం అన్యాయమని విమర్శించారు. రాబోయే రోజుల్లో వందలాది మంది గ్రామస్తులతో కలిసి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, రంగాయిపల్లి, చెట్ల గౌరారం గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# రెండు రోజుల్లో రికార్డు వసూళ్లు

## దూసుకుపోతున్న అఖిల్ ‘లెనిన్’



అక్కినేని అఖిల్ హీరోగా నటించిన తాజా చిత్రం ‘లెనిన్’ బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల సునామీ సృష్టిస్తోంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 37.2 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసినట్లు చిత్ర నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధికారికంగా ప్రకటించింది. థియేటర్లలో అఖిల్ ఊరమాస్ నటనకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది.మంచి మౌత్ టాక్ రావడంతో సినిమా వసూళ్లు రోజురోజుకు పెరుగుతున్నాయి. “ప్రేక్షకుల మౌత్ టాక్ అద్భుతంగా పనిచేస్తోంది. రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా 37.2 కోట్ల గ్రాస్ సాధించి ‘లెనిన్’ దూసుకుపోతోంది” అంటూ నిర్మాణ సంస్థ ఓ ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేసింది. చాలా కాలంగా సరైన కమర్షియల్ హిట్ కోసం ఎదురుచూస్తున్న అఖిల్‌కు ఈ సినిమా రూపంలో అది లభించడంతో అక్కినేని అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు.మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో గ్రామీణ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో అఖిల్ సరసన భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో పాటు అన్నపూర్ణ స్టూడియోస్, మనం ఎంటర్‌ప్రైజెస్ ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మించాయి. ఎస్ఎస్ తమన్ అందించిన నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచిందని ప్రేక్షకులు చెబుతున్నారు. వీకెండ్ ముగిసే నాటికి ఈ వసూళ్లు మరింత పెరిగే అవకాశం ఉందని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఓటీటీల్లో సంచలనం సృష్టిస్తున్న మైథలాజికల్ డార్క్ థ్రిల్లర్ ‘త్రికాల’



తెలుగు సినీ పరిశ్రమలో విభిన్నమైన మైథలాజికల్ డార్క్ థ్రిల్లర్‌గా రూపొందిన ‘త్రికాల’ సినిమా థియేటర్లలో మంచి స్పందన అందుకుని, ఇప్పుడు ఓటీటీ వేదికలపై సైతం సంచలనం సృష్టిస్తోంది. ‘‘మా రాషితీఅజ్ శీట +శీస’ అనే ఆసక్తికరమైన సబ్‌టైటిల్‌తో వచ్చిన ఈ చిత్రం ప్రస్తుతం జియో హాట్‌స్టార్, అమెజాన్ ప్రైమ్, సన్‌నెక్స్ట్ వంటి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో స్ట్రీమింగ్ అవుతూ టాప్ రేటింగ్‌తో ట్రెండ్ అవుతోంది. ప్రముఖ రేటింగ్ సంస్థ ఐఎండీబీ (×వీణఎ)లోనూ ఈ చిత్రం ఏకంగా 9.1 రేటింగ్ అందుకుని చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా నిలిచింది. శ్రద్ధా దాస్, మహేంద్రన్, అజయ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని దర్శకుడు మణి తెల్లగూటి అద్భుతంగా తెరకెక్కించారు. ఈ సినిమా కేవలం డైలాగులకే పరిమితం కాకుండా కర్మ సిద్ధాంతం, గో సంరక్షణ అవసరాన్ని మరియు పునర్జన్మల వైవిధ్యాన్ని విజువల్‌గా ఆవిష్కరించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తోంది. పౌరాణికతను ఆధునిక ప్రపంచంతో మేళవిస్తూ మైథాలజీ, సైకాలజికల్ హారర్, డార్క్ ఫాంటసీ అంశాలను సమన్వయం చేసిన దర్శకుడు మణి తెల్లగూటి ఈ సినిమాను ఒక విజువల్ వండర్‌గా మలిచారు. స్క్రిప్ట్ దశ నుంచే ప్రతి ఫ్రేమ్‌ను విజువల్‌గా డిజైన్ చేయడం ఆయన టెక్నికల్ నైపుణ్యాన్ని చాటుతోంది. ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లడంలో పవన్ చెన్న అందించిన డార్క్ విజువల్స్, షాజీద్ హ్యూమాయన్ అందించిన మైండ్ బ్లోయింగ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రధాన బలాలుగా నిలిచాయి. వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన ఈ చిత్రం అటు థియేటర్లలో, ఇటు ఓటీటీల్లోనూ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ టాలీవుడ్‌లో సరికొత్త చర్చకు దారితీసింది.

# ఆకాశంలో కార్గిల్ యుద్ధం

## సిద్దార్థ్ ‘ఆపరేషన్ సఫేద్ సాగర్’ టీజర్ విడుదల

1999 కార్గిల్ యుద్ధంలో భారత వైమానిక దళం ప్రదర్శించిన అసమాన శౌర్య పరాక్రమాల నేపథ్యంలో తెరకెక్కిన హై-వోల్టేజ్ వార్ డ్రామా సిరీస్ ‘ఆపరేషన్ సఫేద్ సాగర్’. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఇండియా ఈ ప్రతిష్టాత్మక సిరీస్ యొక్క అధికారిక టీజర్‌ను తాజాగా విడుదల చేసింది. ఈ సిరీస్‌లో సిద్దార్థ్, జిమ్మీ షెర్గిల్, అభయ్ వర్మ తదితరులు ప్రధాన పాత్రల్లో నటించారు.

పర్వత శిఖరాల నుంచి ఆకాశం వరకు సరికొత్త ఉత్సాహంతో దూసుకెళ్లేందుకు సిద్ధమైన ‘ది గోల్డెన్ యారోస్’ స్క్వాడ్రన్‌కు చెందిన యువ వీరుల అసాధారణ పోరాటాన్ని, వారి దేశభక్తిని ఈ సిరీస్‌లో కళ్ళకు కట్టినట్లు చూపించబోతున్నారు.




యథార్థ సంఘటనల ఆధారంగా, అత్యంత భారీ నిర్మాణ విలువలతో రూపొందిన ఈ యాక్షన్ డ్రామా సిరీస్ ఆగస్టు 7 నుంచి ప్రపంచవ్యాప్తంగా నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది.

## అద్భుత దృశ్యకావ్యానికి

# ముహూర్తం ఫిక్స్

## - జూలై 24న ‘రామాయణ’ ట్రైలర్!



ఇండియన్ సినిమా హిస్టరీలోనే మోస్ట్ అవేటెడ్ మూవీగా నిలుస్తున్న ‘రామాయణ’ సినిమా నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. నితేష్ తివారీ దర్శకత్వంలో రణబీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), రాకింగ్ స్టార్ యష్ (రావణాసురుడు) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ పౌరాణిక చిత్రం యొక్క అఫీషియల్ ట్రైలర్ రిలీజ్ డేట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. జూలై 24న ఈ మూవీ ట్రైలర్‌ను ప్రపంచవ్యాప్తంగా చాలా గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతున్నట్లు సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. వేలాది సంవత్సరాలుగా భారతదేశ సంస్కృతికి, సనాతన ధర్మానికి ప్రతీకగా నిలిచిన రామాయణాన్ని ఈ తరం ఆడియన్స్‌కు నచ్చేలా సరికొత్తగా చూపించబోతున్నారు. హాలీవుడ్ రేంజ్ విజువల్ ఎఫెక్ట్స్, భారీ నిర్మాణ విలువలతో నమిత్ మల్హోత్రా ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు. కంప్లీట్ ఇండియన్ సినిమా హిస్టరీలోనే ముందెన్నడూ చూడని విధంగా, ఊహించని రేంజ్ బడ్జెట్‌తో ఈ సినిమా రెడీ అవుతోంది. దేశం గర్వించే ఈ గొప్ప ఇతిహాసాన్ని వరల్డ్ వైడ్ ఆడియన్స్ ముందుకు గ్రాండ్‌గా తీసుకురాబోతున్నారు. కాగా, ఈ క్రేజీ మూవీ పార్ట్-1 ను ఈ ఏడాది దీపావళి కానుకగా థియేటర్లలో రిలీజ్ చేయడానికి ప్లాన్ చేస్తున్నారు.

## దళపతి విజయ్ ‘జననాయగన్’

# సెన్సార్ పూర్తి..

## కానీ విడుదల వాయిదా!

కోలీవుడ్ స్టార్, తమిళనాడు ముఖ్యమంత్రి దళపతి విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం ‘జననాయగన్’ ఎట్టకేలకు సెన్సార్ ఫార్మాలిటీస్‌ను విజయవంతంగా పూర్తి చేసుకుంది. దాదాపు ఏడు నెలల సుదీర్ఘ నిరీక్షణ, పలు



న్యాయపోరాటాల అనంతరం ఈ చిత్రానికి సెన్సార్ బోర్డు (జదీఖీజ) ‘‘మా’ (అడల్ట్) సర్టిఫికేట్‌ను జారీ చేసింది. హెచ్. వినోద్ దర్శకత్వంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ఈ పొలిటికల్ యాక్షన్ డ్రామా చిత్రం మొత్తం 3 గంటల 3 నిమిషాల సుదీర్ఘ రన్‌టైమ్‌తో థియేటర్లలో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైంది. తీవ్రమైన రాజకీయ నేపథ్యం ఉన్న కథాంశం కావడంతో, సెన్సార్ బోర్డు సూచనల మేరకు విజయ్ క్యారెక్టర్ పేరు ఆధారంగా వచ్చే ‘టీవీకే’ డైలాగ్స్ రెఫరెన్స్‌లతో పాటు మరికొన్ని వివాదాస్పద సీన్లను మేకర్స్ మార్చడం లేదా మ్యూట్ చేసినట్లు తెలుస్తుంది. ఇక ఈ చిత్రంలో పూజా హెగ్డే, బాబీ డియోల్, మమితా బైజూ కీలక పాత్రలు పోషించారు. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతాన్ని అందించారు. వీఎన్ ప్రొడక్షన్స్ (ఖఎచీ ూతీశీసబషషఱశీఅం) ఈ భారీ చిత్రాన్ని నిర్మించింది. అయితే మొదట ఈ సినిమాను జూలై 24న విడుదల చేయాలని భావించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా ఈ విడుదల తేదీ వాయిదా పడింది. త్వరలోనే సరికొత్త అధికారిక విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ స్పష్టం చేసింది.



## జాన్వీ కపూర్ పాత్రపై

# వచ్చిన విమర్శలకు చెక్

## - ఎడిటింగ్‌తో మంచి స్పందన!

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా, జాన్వీ కపూర్ హీరోయిన్‌గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కించిన ‘పెద్ది’ థియేటర్లలో ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే. బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు రాబట్టిన ఈ ఎమోషనల్ స్పోర్ట్స్ డ్రామా తాజాగా ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతూ మరోసారి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.

అయితే ఈసారి సినిమా కథతో పాటు జాన్వీ కపూర్ పాత్రకు సంబంధించిన మార్పులు చర్చనీయాంశంగా మారాయి. సినిమా థియేటర్లలో విడుదలైన సమయంలో జాన్వీ కపూర్ పోషించిన పాత్రపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ముఖ్యంగా ఆమెకు సంబంధించిన కొన్ని సన్నివేశాలు కథకు పెద్దగా ఉపయోగపడలేదని, కొన్ని సన్నివేశాలు అనవసరంగా, అసభ్యంగా అనిపించాయని పలువురు ప్రేక్షకులు అభిప్రాయపడ్డారు. దీంతో జాన్వీ పాత్ర సినిమా విడుదల సమయంలో హాట్ టాపిక్‌గా మారింది. దఅయితే నెట్‌ఫ్లిక్స్‌లో విడుదలైన ఓటీటీ వెర్షన్‌లో మేకర్స్ కొన్ని మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

జాన్వీ కపూర్‌కు సంబంధించిన పలు సన్నివేశాలను కత్తిరించడం లేదా నిడివిని తగ్గించడం ద్వారా కథనాన్ని మరింత వేగంగా, సహజంగా తీర్చిదిద్దారు. ఈ మార్పుల వల్ల సినిమా ఫ్లో మెరుగుపడిందని, కథపై ప్రేక్షకుల దృష్టి మరింత కేంద్రీకృతమైందని సోషల్ మీడియాలో కామెంట్లు వినిపిస్తున్నాయి. ఓటీటీ వెర్షన్ విడుదలైన తర్వాత జాన్వీ పాత్రపై గతంలో వచ్చినంత తీవ్ర విమర్శలు కనిపించడం లేదు.

పాత్రను మరింత కుదించి, అవసరమైన మేరకే చూపించడంతో ప్రేక్షకుల నుంచి కూడా సానుకూల స్పందన వస్తోంది. థియేటర్లలో ఎక్కువగా చర్చకు దారితీసిన అంశం ఇప్పుడు పెద్దగా ప్రస్తావనకు రాకపోవడం విశేషం ఈ పరిణామం జాన్వీ కపూర్‌కు కూడా కొంత ఊరట కలిగించే అంశంగా సినీ వర్గాలు భావిస్తున్నాయి. థియేటర్లలో ఆమె పాత్రపై వచ్చిన నెగెటివ్ కామెంట్లు ఓటీటీలో గణనీయంగా తగ్గడంతో, ఇప్పుడు ప్రేక్షకులు సినిమా మొత్తం కథ, రామ్ చరణ్ నటన, ఎమోషనల్ సన్నివేశాలపైనే ఎక్కువగా చర్చిస్తున్నారు. మరోవైపు, ‘పెద్ది’ ఓటీటీలో విడుదలైన వెంటనే నెట్‌ఫ్లిక్స్ ఇండియా ట్రెండింగ్ జాబితాలో అగ్రస్థానంలో నిలిచి తన సత్తా చాటుతోంది.

## లొంక కేసారం లో రహదారి విస్తీర్ణ పనులు చేయించిన సర్పంచ్ ఎం.డి. మంజూర్



మంథని ( ప్రశ్న న్యూస్) లొంక కేసారం గ్రామంలో రోడ్డు ఎత్తు వంపులతో పిచ్చి మొక్కల పెరగడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తొలి సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు స్పందించిన తొలి సర్పంచ్ తన సొంత ట్రాక్టర్ తో ఇరువైపులా పెరిగిన పిచ్చి చెట్లు తొలగించడం పనులు చేయించడం జరిగింది , తొలి సర్పంచ్ చొరవతో తొలగించడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన వెంట ఈ పనిలో భాగంగా వార్డు సభ్యులు. నామనీ రామ్మూర్తి, ఎగ్గం మల్లేశ్వరి-సదయ్య, బండి లక్ష్మీ -శంకరయ్య తొలి వార్డ్ సభ్యులు రసమల్ల రాజమౌళి మరియు రైతులు పాల్గొనడం జరిగింది.

## మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణకు శ్రీకారం

- బాలకృష్ణ కృషితోనే నిధులు
- రాయలసీమకు కూటమి ప్రభుత్వంతోనే ఉజ్వల భవిష్యత్తు: మంత్రి నిమ్మల రామానాయుడు



**హిందూపురం(ప్రశ్న న్యూస్)** హిందూపురం, పెనుగొండ, మడకశిర నియోజకవర్గాల రైతులకు సాగునీటి వరంగా నిలిచే మడకశిర బ్రాంచ్ కెనాల్ వెడల్పు పనులకు రూ.790 కోట్లతో ఆదివారం శ్రీకారం చుట్టారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సంయుక్తంగా పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ, రాయలసీమను రత్నాల సీమగా తీర్చిదిద్దాలన్న ఎన్టీఆర్ సంకల్పాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కార్యరూపం దాల్చేలా కృషి చేస్తున్నారని అన్నారు. మడకశిర బ్రాంచ్ కెనాల్ విస్తరణకు ఎమ్మెల్యే బాలకృష్ణ చేసిన నిరంతర కృషి వల్లే నిధులు మంజూరయ్యాయని, ఇందుకు హిందూపురం ప్రజలు ఆయనకు రుణపడి ఉంటారని పేర్కొన్నారు.2014--19 మధ్య తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం రాయలసీమలో సాగునీటి ప్రాజెక్టులకు రూ.12 వేల కోట్లు వెచ్చించిందని, అనంతరం వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించి ప్రాంత అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.హంద్రీ-నీవా కాలువ పనులు గత ప్రభుత్వ హయాంలో ముందుకు సాగలేదని ఆరోపించిన మంత్రి, కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే రూ.3,800 కోట్లు వెచ్చించి 728 కిలోమీటర్ల దూరంలోని కుప్పం వరకు కృష్ణా జలాలను తరలించిన ఘనత సాధించిందని అన్నారు.ఈ కార్యక్రమంలో హిందూపురం ఎంపీ బి.కే. పార్థసారథి, ఎమ్మెల్యేలు కందికుంట ప్రసాద్, అమిలినేని సురేంద్రబాబు, ఎం.ఎస్. రాజు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ విరమణ అనేది సేవలకు ముగింపు కాదు

- కార్మికుల హక్కుల కోసం పి.శ్రీనివాస్ రెడ్డి చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయి.
- తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్ర ఎప్పటికీ మరువలేనిది.
- సమాజ సేవలో ఆయన మరింత చురుకుగా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాం.
- టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్తమ రెడ్డి



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) ఉద్యోగ విరమణ తప్పనిసరి.. చేసిన సేవలే గుర్తింపునిస్తాయి కార్మికుల హక్కుల సాధనలో పి. శ్రీనివాస్ రెడ్డి సేవలు ఎనలేనివి.తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన పాత్ర అమోఘమని టీఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశ్వత్తమ రెడ్డి కొనియాడారు. ఆదివారం మెదక్ పట్టణంలోని శ్రీ సాయి బాలాజీ గార్డెన్స్ లో అకౌంటెంట్ గా ఉద్యోగ విరమణ పొందిన శ్రీనివాస్ రెడ్డి సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది.దశాబ్దాలపాటు నిజాయితీతో విధులు నిర్వహించి అకౌంటెంట్‌గా ఉద్యోగ విరమణ పొందిన పి.ఎస్. శ్రీనివాస్ రెడ్డికి సహోద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా అశ్వాత్తమ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగం నుంచి పదవీ విరమణ సహజమైన ప్రక్రియ అయినప్పటికీ, సమాజానికి చేసిన సేవలే శాశ్వత గుర్తింపును తీసుకొస్తాయని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణలో శ్రీనివాస్ రెడ్డి చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు సామాజిక సేవ, కార్మిక సంక్షేమం, తెలంగాణ ఉద్యమంలో ఆయన చురుకైన పాత్ర అందరికీ ఆదర్శమని అన్నారుకార్మికుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడం, వారి హక్కుల కోసం న్యాయబద్ధంగా పోరాడడం, సంక్షేమ కార్యక్రమాల్లో ముందుండడం వంటి అంశాల్లో శ్రీనివాస్ రెడ్డి విశేష సేవలు అందించారని గుర్తు చేశారుప్రత్యేక తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ఉద్యోగులు, కార్మికులను ఉద్యమంలో భాగస్వాములను చేయడంలో శ్రీనివాస్ రెడ్డి కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.ఉద్యోగ జీవితమంతా పారదర్శకత, క్రమశిక్షణ, నిబద్ధతతో విధులు నిర్వర్తించి సహోద్యోగుల అభిమానాన్ని సంపాదించారని అన్నారు. అకౌంటెంట్‌గా ఆయన అందించిన సేవలు సంస్థకు ఎంతో మేలుచేశాయని కొనియాడారు.ఘన సన్మానం ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డికి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. సహోద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు ఆయన సేవలను కొనియాడుతూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, టిఎంయూ రాష్ట్ర నాయకులు థామస్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బిఆర్ఎస్ ఇంచార్జీ తిరుపతి రెడ్డఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు కృష్ణారెడ్డి, మేడి రాధా కిషన్ రావ్, శాఖయ్య, దశరథ్ రెడ్డి, అశ్వక్ హైమద్ లతో పాటు ఆయా పార్టీల ప్రజా ప్రతినిధులు,ఉద్యోగ సంఘాల నాయకులు, జర్నలిస్ట్ సంఘాల నాయకులు, కుటింబికులు, బంధువులు పాల్గొని సన్మానించారు.

# శ్రీశైలంలో పోటెత్తిన భక్తజనం

**వారాంతపు సెలవులతో అనూహ్య రద్దీ.**
**విరామ దర్శనాలు తాత్కాలికంగా నిలిపివేత**
**స్పర్శ దర్శనాలకు ముందస్తు టికెట్లు పొందిన వారికే అవకాశం..**
**క్యూ లైన్లలో భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు**





శ్రీశైలం(ప్రశ్న న్యూస్) వారాంతపు సెలవులు, మాసశివరాత్రి వేళ సమీపిస్తుండటంతో ప్రముఖ శైవక్షేత్రమైన శ్రీశైలంలో ఆదివారం భక్తుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. తెల్లవారుజాము నుంచే రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తజన సందోహంతో కళకళలాడాయి. ప్రధాన ఆలయం, క్యూకాంప్లెక్స్‌లు, ఘాట్ రోడ్లు, వసతి గృహాల వద్ద ఎక్కడ చూసినా భక్తుల సందడే కనిపించింది.
అనూహ్యంగా పెరిగిన రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా దర్శన ఏర్పాట్లలో మార్పులు చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం వరకు నిర్వహించే విరామ దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. రద్దీ తగ్గే వరకు ఈ నిర్ణయం అమల్లో ఉంటుందని తెలిపారు.
మాసశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివారి సన్నిధి భక్తిశ్రద్ధలతో నిండిపోగా, "హర హర మహాదేవ" నినాదాలతో శ్రీశైలం క్షేత్రం ఆధ్యాత్మిక వాతావరణంలో మునిగిపోయింది. అధికారులు చేపట్టిన ఏర్పాట్లతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తూ, సజావుగా దర్శనం చేసుకుంటున్నారు.

# శ్రీశైలంలో లడ్డు విక్రయ కేంద్రంపై ఆకస్మిక తనిఖీ

**- ప్రసాదాల నాణ్యత, శుచిత్వంపై రాజీ ఉండొద్దు**
**- చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు**





శ్రీశైలం(ప్రశ్న న్యూస్) శ్రీశైల దేవస్థానంలో భక్తులకు అందించే లడ్డు, పులిహోర ప్రసాదాల నాణ్యత, విక్రయ వ్యవస్థపై ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పోతుగుంట రమేష్ నాయుడు ఆదివారం సాయంత్రం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. లడ్డు ప్రసాదాల విక్రయ కేంద్రాలను సందర్శించి స్టాక్ నమోదు, టికెట్ల జారీ విధానం, నగదు లావాదేవీలను పరిశీలించారు.కౌంటర్లలో జరిగిన అమ్మకాల వివరాలను నగదుతో సరిపోల్చి పరిశీలించిన ఆయన, ప్రసాదాల తయారీలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. లడ్డు, పులిహోర ప్రసాదాల నాణ్యతలో ఎలాంటి లోపం లేకుండా తయారీ ప్రక్రియ కొనసాగించాలని సూచించారు.శని, ఆదివారాలు, సోమవారాలు, ప్రభుత్వ సెలవులు, పర్వదినాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉండే నేపథ్యంలో అవసరమైన మేరకు ముందుగానే ప్రసాదాలను సిద్ధంగా ఉంచాలని పేర్కొన్నారు. రోజువారీ డిమాండ్‌ను అంచనా వేసి ప్రణాళికాబద్ధంగా ప్రసాదాల తయారీ చేపట్టాలని సూచించారు.ప్రసాదాల విక్రయ కేంద్రాల వద్ద భక్తులు ఎక్కువసేపు క్యూల్లో వేచి ఉండకుండా త్వరితగతిన ప్రసాదాలు అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. భక్తులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కూడా సూచించారు.అనంతరం దేవస్థానం విభూతి విక్రయ కేంద్రాన్ని కూడా తనిఖీ చేసిన రమేష్ నాయుడు, స్టాక్ రిజిస్టర్లు, రోజువారీ విక్రయాల వివరాలను పరిశీలించి, కౌంటరులోని నగదును అమ్మకాల రికార్డులతో సరిపోల్చి తనిఖీ చేశారు. భక్తులకు పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించడమే దేవస్థానం లక్ష్యమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# రోడ్లు వెడల్పయ్యాయి... ట్రాఫిక్ కష్టాలు మాత్రం తగ్గలేదు

**- గజ్వేల్ షాపింగ్ మాల్ వద్ద నిత్యం ట్రాఫిక్ నరకం - అక్రమ పార్కింగ్‌తో గంటల తరబడి వాహనాలు నిలిచిపోతున్నాయి**
**- అక్రమ పార్కింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**
**- ట్రాఫిక్ రూల్స్ కచ్చితంగా పాటించాలని గజ్వేల్ ట్రాఫిక్ సిఐ హెచ్చరికలు**




గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్-ప్రజ్ఞాపూర్ ప్రధాన రహదారిని కోట్ల రూపాయలతో విస్తరించినప్పటికీ, అక్రమ పార్కింగ్ కారణంగా ట్రాఫిక్ సమస్యలు మాత్రం యథాతథంగా కొనసాగుతున్నాయి. ముఖ్యంగా కొత్తగా ప్రారంభమైన షాపింగ్ మాల్ పరిసరాల్లో వాహనాలను రోడ్డుపైనే నిలిపివేయడంతో ప్రతిరోజూ ట్రాఫిక్ స్తంభిస్తోంది.ప్రజ్ఞాపూర్ చౌరస్తా, యూనియన్ బ్యాంక్ సమీపం, షాపింగ్ మాల్, బసవేశ్వర విగ్రహం, అంబేద్కర్ చౌరస్తా, ఇందిరా పార్క్, తూప్రాన్ రోడ్డులోని పెట్రోల్ బంక్ ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా, కొన్నిచోట్ల నడిరోడ్డువరకు వాహనాలు పార్క్ చేయడం వల్ల ఆర్టీసీ బస్సులు, అంబులెన్సులు, భారీ వాహనాలు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ముఖ్యంగా షాపింగ్ మాల్ వద్ద సెలవు రోజులు, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ తీవ్రరూపం దాల్చుతోంది. కొన్నిసార్లు గంటకు పైగా వాహనాలు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోందని వాహనదారులు చెబుతున్నారు.ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీలు, డ్రైవింగ్ లైసెన్సుల పరిశీలన, పెండింగ్ చలాన్ల వసూళ్లపై దృష్టి సారిస్తున్నప్పటికీ, ట్రాఫిక్‌కు ప్రధాన కారణంగా మారిన అక్రమ పార్కింగ్‌ను నియంత్రించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రహదారుల విస్తరణకు ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసినా, అక్రమ పార్కింగ్‌పై కఠిన చర్యలు తీసుకోకపోతే ఆ అభివృద్ధి ప్రజలకు ఉపయోగపడదని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమంగా పార్క్ చేసిన వాహనాలను తొలగించడం, 'నో పార్కింగ్' జోన్లు ఏర్పాటు చేయడం, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.




# తిమ్మక్కపల్లి గ్రామంలో ఘనంగా వనమహోత్సవం

**- 500 మొక్కలు నాటిన అధికారులు, ప్రజాప్రతినిధులు**

గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )సిద్ధిపేట జిల్లా రాయ్‌పోల్ మండలంలోని తిమ్మక్కపల్లి గ్రామంలో వనమహోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రత లక్ష్యంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో గ్రామంలో 500 మొక్కలను నాటారు.ఈ కార్యక్రమం మిడిదొడ్డి ఎక్సైజ్ సీఐ గాయత్రి ఆధ్వర్యంలో నిర్వహించగా, గ్రామ ప్రజలు, యువత, ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, నాటిన ప్రతి మొక్కను సంరక్షిస్తేనే పచ్చని తెలంగాణ సాధ్యమవుతుందని ఎక్సైజ్ సీఐ గాయత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సరిత మేడమ్, హెచ్‌సీ గాలిబ్, ఈసీ సాయికిరణ్, ఈసీ హరీష్, ఈసీ రామ, గ్రామ సర్పంచ్ సత్తు అశోక్ రెడ్డి, మాదాసు రాములు గౌడ్, మాదాసు లింగం గౌడ్, ఉడిది బాలయ్య, గొల్ల బాలయ్య, కొండాపురం రాజయ్య, శివోళ్ల బాలయ్య తదితరులు పాల్గొని మొక్కలు నాటారు.గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని అధికారులు, ప్రజాప్రతినిధులు గ్రామస్తులకు పిలుపునిచ్చారు.



# ఉద్యమాలా.? రాజకీయ నాటకాలా.?

## 'ముందస్తు అరెస్టుల' వెనుక దొంగాట.?


**- రోడ్డుపైకి రారు.. సమస్యపై కొట్లాడరు.. పోలీస్ స్టేషన్లలో ఫొటోల ఫోజులకే పరిమితం**

**- జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ ధర్నాలో రాజకీయ పార్టీల అసలు రంగులు**

**కీసర (ప్రశ్న న్యూస్)** ప్రజా సమస్యలపై పోరాడాల్సిన నాయకులు.. ముందస్తు అరెస్టుల పేరుతో సరికొత్త దొంగాట ఆడుతున్నారు. ప్రజల పక్షాన నిలబడి సమస్య పరిష్కారం అయ్యేంతవరకు కొట్లాడాల్సిన ప్రజా నాయకులు ప్రస్తుతం ఎక్కడ కనిపించడం లేరు. కానీ ప్రజాస్వామ్య ఆయుధమైన 'ధర్నా'ను.. కేవలం పోలీస్ స్టేషన్లలో ఫొటోల ఫోజులకే పరిమితం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శనివారం నాడు జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ బాధిత జేఏసీ పిలుపునిచ్చిన ధర్నా వేదికగా.. రాజకీయ పార్టీల అసలు రంగు మరోసారి బట్టబయలయినది. నాయకులని పదం మార్చుకుంటే బాగుంటుందని స్థానిక ప్రజలు సూచిస్తున్నారు. ఎందుకంటే వీళ్ళ ఊసరవెల్లి నాటకాలతో ప్రజలు అయోమయానికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రాత్రికి రాత్రే 'ముందస్తు' డ్రామాలు..

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తరలించాలంటూ, చెత్త లారీలను నిలిపివేయాలంటూ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం పెద్ద ఎత్తున ధర్నాకు పిలుపునిచ్చారు. దీనికి అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ప్రకటించి, తాము కూడా ఉద్యమంలో భాగస్వామ్యమవుతామని ప్రగల్భాలు పలికాయి. తీరా ధర్నా రోజు






వచ్చేసరికి.. ముందు రోజు రాత్రి నుంచే నేతలంతా 'ముందస్తు అరెస్టు'ల పేరిట పోలీస్ స్టేషన్ల బాట పట్టారు. సమస్యపై రోడ్డు మీదకు వచ్చి, ప్రజలతో కలిసి నిరసన తెలపకుండా, ధర్నాను సక్సెస్ చేయకుండా.. పోలీసులకు ముందస్తుగానే సహకరిస్తూ అరెస్ట్ కావడం వెనుక ఉన్న అంతర్యమేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పోలీస్ స్టేషన్‌లో కూర్చొని ఫొటోలు దిగి, సోషల్ మీడియాలో పోస్ట్ చేయడమేనా ఉద్యమం అంటే.? అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### ముప్పై ఏళ్ల గోస.. లక్షల మంది నరకం..

జవహర్ నగర్, దమ్మాయిగూడ, బండ్లగూడ, చీర్యాల, షామీర్పేట పరిసర ప్రాంతాల ప్రజలు గత 30 సంవత్సరాలుగా ఈ డంపింగ్ యార్డ్ వల్ల నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో పెద్ద పాఠశాలలు ఉన్నాయి. పసిపిల్లలు, పాఠశాల విద్యార్థులు నిత్యం వచ్చే తీవ్రమైన దుర్వాసన, దోమల వల్ల అంతుచిక్కని రోగాల బారిన పడుతున్నారు. ప్రస్తుత వర్షాకాలంలో ఇక్కడ నివసించడమే ఒక శాపంగా మారిందని స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు. కలుషిత నీరు, కంపు కొట్టే వాతావరణంతో ఈ ప్రాంతాలు రోగాల నిలయాలుగా మారుతున్నాయి.

### అంతా ఫెయిల్యూర్.. అసలు పరిష్కారం ఏది.?

ఇంతటి తీవ్రమైన సమస్యపై ఇన్నేళ్లుగా పోరాటాలు చేస్తున్నామని చెప్పుకుంటున్న ఏ ఒక్క నాయకుడు కూడా ఈ డంపింగ్ యార్డ్‌ను ఇక్కడి నుంచి కదల్చలేకపోయారు. అందరూ కలిసి మనస్ఫూర్తిగా, సమిష్టిగా రోడ్డుపైకి వచ్చి నిరసనలు, ధర్నా చేసి ఉంటే ప్రభుత్వంపై ఒత్తిడి పెరిగి సమస్యకు పరిష్కారం దొరికేది. కానీ ఎవరికి వారు కావాలని 'ముందస్తు అరెస్ట్' డ్రామాలకు తెరలేపడం వల్లే ఉద్యమాలు నిర్వీర్యమవుతున్నాయి. ఇది కేవలం రాజకీయ పార్టీలు ఆడుతున్న కపట నాటకమని, ప్రజల ఓట్ల కోసమే తప్ప సమస్య పరిష్కారం కోసం కాదనేది స్పష్టమవుతోంది. ఇప్పటికైనా నాయకులు ఫొటోల ఫోజులు పక్కనబెట్టి, సమస్యపై నిజాయితీగా, క్షేత్రస్థాయిలో పోరాడకపోతే ప్రజలే తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని బాధితులు హెచ్చరిస్తున్నారు.

### రాత్రికి రాత్రే తెరవెనుక స్కెచ్..

ప్రజా సమస్యలపై పోరాటమంటే ఒకప్పుడు పగలు, రాత్రి రోడ్లపైనే బైఠాయించేవారు. కానీ నేటితరం నేతలు సరికొత్త 'రాత్రికి రాత్రే స్కెచ్'లకు తెరలేపుతున్నారు. జవహర్‌నగర్ ధర్నా రోజు ఉదయం ఉధృతంగా నిరసన తెలపాల్సిన నాయకులు.. దానికి ముందు రోజు రాత్రి నుంచే తెరవెనుక వ్యూహాలు సిద్ధం చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది నాయకులు తాము క్షేత్రస్థాయిలోకి వెళ్లకుండా అసలు ధర్నా జరగకుండా పోలీసులతో ముందస్తుగా 'అండర్ స్టాండింగ్' కుదుర్చుకున్నారనే విమర్శలు ప్రజల నుండి బలంగా వినిపిస్తున్నాయి.

పోలీసులు వచ్చి అరెస్ట్ చేస్తుంటే అడ్డుకోవాల్సింది పోయి.. తామే స్వచ్ఛందంగా వాహనాలు ఎక్కి స్టేషన్ల బాట పట్టడం వెనుక అసలు రహస్యం ఏంటి.? రాత్రికి రాత్రే ఇళ్ల వద్ద అరెస్ట్ అయిపోతే.. మరుసటి రోజు ప్రజలతో కలిసి రోడ్డుపై కొట్లాడే పనే ఉండదు. అటు ప్రజల్లో 'మీ కోసం అరెస్ట్ అయ్యాం' అని చెప్పుకోవడానికి, ఇటు అధికార యంత్రాంగం దృష్టిలో 'సమస్యను ముగించాం' అని మార్కులు కొట్టేయడానికి డూప్లికేట్ నాయకులకు ఈ 'ముందస్తు' నాటకం ఒక అస్త్రంగా మారింది. దమ్మాయిగూడ, జవహర్ నగర్ బండ్లగూడ, చీర్యాల ప్రజలు రోగాలతో రాత్రంతా నిద్రలేకుండా గడుపుతుంటే.. ఈ నాయకులు మాత్రం పోలీసులకు సహకరిస్తూ స్టేషన్లలో సేదతీరడం ఏ రకమైన ఉద్యమ శైలి.? ఈ తెరవెనుక స్కెచ్‌లు కేవలం రాజకీయ ఉనికి కోసమే తప్ప, ప్రజా శ్రేయస్సు కోసం కాదనేది స్పష్టమవుతోంది.

### కనిపించని సమిష్టితత్వం.. కొరవడిన చిత్తశుద్ధి..

ఒక వైపు జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ గుట్టలుగా పేరుకుపోతుంటే, మరోవైపు స్థానిక రాజకీయ నేతల వైఫల్యాలు కూడా అంతే స్థాయిలో కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ముప్పై ఏళ్లుగా జవహర్ నగర్, దమ్మాయిగూడ, బండ్లగూడ పరిసర ప్రాంతాల ప్రజలు కంపు వాసనతో అల్లాడుతున్నా పరిష్కారం దొరకకపోవడానికి నేతల్లో సమిష్టితత్వం, చిత్తశుద్ధి కొరవడటమే ప్రధాన కారణం.

జేఏసీ ధర్నాకు అన్ని పార్టీలూ మద్దతు ప్రకటించినప్పుడు అందరూ కలిసికట్టుగా ఒకే వేదికపైకి వచ్చి కొట్లాడాల్సింది పోయి ఎవరికి వారు 'ముందస్తు అరెస్టుల' వ్యక్తిగత పబ్లిసిటీకి తెరలేపారు. ఇక్కడి నేతలకు ప్రజా సమస్య కంటే సొంత రాజకీయ మైలేజ్, ఇమేజ్ మాత్రమే ముఖ్యమైపోయాయి. ఏ పార్టీకి ఆ పార్టీ విడివిడిగా ప్రకటనలు గుప్పించడమే తప్ప, ఒకరినొకరు కలుపుకొని పోయే సమిష్టి కార్యాచరణ ఎక్కడా లేదు. ప్రజల ఆరోగ్యం, పసిపిల్లల భవిష్యత్తు కంటే తమ సొంత జెండాలు, ఎజెండాలే ముఖ్యం అనుకోవడం ఏ రకమైన ప్రజా సేవ.? నేతల్లో నిజమైన కసి, బాధ్యత లేకపోవడం వల్లే బాధితుల పోరాటాలు ప్రతిసారీ పోలీస్ స్టేషన్ల గేట్ల ముందే ఆగిపోతున్నాయి. ఇప్పటికైనా స్వార్థ రాజకీయాలు పక్కనబెట్టి సమిష్టిగా పోరాడకపోతే ప్రజలు క్షమించరు.

### పాఠశాలల చెంతనే కంపు.. పసిప్రాణాలకు ముప్పు..

రాజకీయ నాయకుల ముందస్తు అరెస్టుల డ్రామాలు ఒక ఎత్తైతే, జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ కారణంగా ఇక్కడి చిన్నారుల భవిష్యత్తు అంధకారమవ్వడం మరో ఘోరమైన వాస్తవం. దమ్మాయిగూడ, జవహర్ నగర్, బండ్లగూడ, చీర్యాల ప్రాంతాల్లోని పదుల సంఖ్యలో పెద్ద పాఠశాలల్లో చదువుకునే వేలాది మంది విద్యార్థులు.. అక్షరాలతో పాటు విషపూరిత వాయువులను పీల్చాల్సి వస్తోంది. బడి గదుల్లో కూర్చున్నా ముక్కుపుటాలదిరిపోయే దుర్వాసన పసిపిల్లలను నిమిషం కూడా ప్రశాంతంగా ఉండనివ్వడం లేదు. డంపింగ్ యార్డ్ పుణ్యమా అని ఈ ప్రాంతం దోమలు, ఈగలు, రోగాలకు నిలయంగా మారి.. పిల్లలు నిత్యం డెంగ్యూ, మలేరియా, శ్వాసకోస వ్యాధుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో కంపు వాతావరణం, కలుషిత భూగర్భ జలాలతో పసిప్రాణాలు గాల్లో దీపాల్లా మారాయని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. నాయకులకు ఓట్లు, ఫొటోల ఫోజులే ముఖ్యం కావచ్చు.. కానీ ఇక్కడ పసిపిల్లల ప్రాణాలు ముప్పులో ఉన్నాయి. పసివాళ్ల భవిష్యత్తు నాశనమవుతున్నా కళ్లు తెరవని పాలకులకు, పోరాటాన్ని పక్కదారి పట్టిస్తున్న నేతలకు ఈ పాపం ఊరికే పోదని స్థానికులు మండిపడుతున్నారు.

### ఓట్ల కోసమేనా ఈ ఆరాటం.?

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ సమస్యపై నేతల ఆరాటం వెనుక ప్రజా శ్రేయస్సు ఉందా.? లేక రాబోయే ఎన్నికల ఓట్ల వేట ఉందా.? అనేదే ఇప్పుడు మిగిలిన ప్రశ్న. ముప్పై ఏళ్లుగా జవహర్ నగర్, దమ్మాయిగూడ, బండ్లగూడ, చీర్యాల పరిసర ప్రాంతాల ప్రజలు నరకం చూస్తున్నా పరిష్కారం దొరకకపోవడానికి ఈ స్వార్థ రాజకీయాలే కారణం.

సమస్య సజీవంగా ఉంటేనే ప్రతి ఎన్నికల్లోనూ ఓట్ల కోసం హామీలు ఇచ్చుకోవచ్చనేది కొందరు నేతల వ్యూహం. అందుకే, జేఏసీ ధర్నా పిలుపునిచ్చిన ప్రతిసారీ జెండాలతో హంగామా చేయడం, తీరా సమయానికి 'ముందస్తు అరెస్టుల' డ్రామాలతో పోలీస్ స్టేషన్లలో ఫొటోలకు ఫోజులివ్వడం వీరికి అలవాటుగా మారింది. ఎన్నికలొస్తే బస్తీల్లో ఇంటింటికి తిరిగే నేతలు.. ప్రజలు కంపు వాసనతో అల్లాడుతుంటే ఏసీ స్టేషన్లలో ఎందుకు తలదాచుకుంటున్నారు.? ఓట్ల రాజకీయం పక్కనబెట్టి రోడ్డుపైకి వచ్చి కొట్లాడకపోతే.. రాబోయే రోజుల్లో ప్రజలు ఏ ఒక్క నాయకుడిని బస్తీల్లోకి అడుగుపెట్టనివ్వరని బాధితులు హెచ్చరిస్తున్నారు.

# పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ

**- త్వరగా కోలుకుని ప్రజాక్షేత్రంలోకి రావాలని ఆకాంక్ష**



**ముంబయి(ప్రశ్న న్యూస్)** కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని ముంబయిలోని ఆసుపత్రిలో చికిత్స అనంతరం కోలుకుంటున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం పరామర్శించారు. ఆయనతో పాటు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ కూడా ఆసుపత్రికి వెళ్లి పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్‌తో కొద్దిసేపు మాట్లాడిన సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ ఆయన ఆరోగ్యంపై వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చికిత్సకు ఆయన సానుకూలంగా స్పందిస్తున్నారని సమాచారం తెలుసుకున్నారు. మంత్రి నారాయణతో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, నాదెండ్ల మనోహర్ కూడా ఉప ముఖ్యమంత్రిని పరామర్శించారు. పవన్ కళ్యాణ్ త్వరగా పూర్తిస్థాయిలో కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని మంత్రి నారాయణ ఆకాంక్షించారు. కూటమి ప్రభుత్వ కార్యక్రమాల్లో ఆయన తిరిగి త్వరలోనే పాల్గొంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# రైస్ మిల్లుపై రెవెన్యూ దాడి

**- పీడీఎస్ బియ్యం స్వాధీనం**

**- మిల్లు యాజమాన్యంపై 6-ఏ కేసు నమోదు**





**విజయనగరం(ప్రశ్న న్యూస్)** ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచిన రైస్ మిల్లుపై రెవెన్యూ అధికారులు దాడి నిర్వహించి 420 కిలోల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా కేంద్రంలోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ సమీపంలోని ఓ రైస్ మిల్లులో ఈ తనిఖీలు చేపట్టారు. దాడిలో అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యాన్ని గుర్తించిన అధికారులు దానిని స్వాధీనం చేసుకుని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. అనంతరం 44వ నంబర్ రేషన్ దుకాణానికి తరలించినట్లు సీఎస్‌డీటీఏ రామారావు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి రైస్ మిల్లు యజమానులు మామిడి పైడిరాజు, మామిడి సాయి, అలాగే అప్పడాల కంపెనీ యజమాని నక్కా వెంకటేష్పై అత్యవసర వస్తువుల చట్టం కింద 6-ఏ కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ బియ్యం అక్రమ రవాణా, నిల్వలు, దుర్వినియోగాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అధికారులు స్పష్టం చేశారు. ఇలాంటి అక్రమాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

# ముగిసిన జానకి అంత్యక్రియలు

**- అనంతలోకాలకు గానకోకిల**





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రముఖ గాయని, 'గాన కోకిల' ఎస్. జానకి అంతిమ యాత్ర ముగిసింది. ఆదివారం ఆమె అంత్యక్రియలు కర్ణాటక ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో జరిగాయి. మైసూరు జిల్లా హెచ్‌డీ కోటె తాలూకాలోని ఆమె వ్యవసాయ క్షేత్రంలో కుటుంబ సభ్యులు, అభిమానుల అశ్రునయనాల మధ్య తుది సంస్కారాలు నిర్వహించారు. జానకమ్మ మనవరాలు అప్సర వైద్యుల తుది కర్మలు జరిపించారు. అంతకుముందు, జానకమ్మ పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం మైసూరులోని మహారాజా కాలేజీ గ్రౌండ్స్‌లో ఉంచారు. తమ అభిమాన గాయనిని కడసారి చూసేందుకు అభిమానులు, సినీ, రాజకీయ ప్రముఖులు వేలాదిగా తరలివచ్చారు. భారతీయ సంగీతానికి ఆమె చేసిన సేవలను గౌరవిస్తూ, పూర్తి ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రకటించారు. వయో సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్న 88 ఏళ్ల జానకి, శనివారం మైసూరులోని అపోలో ఆసుపత్రిలో గుండెపోటుతో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆరు దశాబ్దాలకు పైగా సాగిన తన అద్భుత ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ సహా 20కి పైగా భాషల్లో 48,000కు పైగా పాటలు పాడి ఆమె చరిత్ర సృష్టించారు. ఆమె విశిష్ట గాత్రానికి నాలుగు జాతీయ పురస్కారాలు కూడా లభించాయి. జానకి మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సంగీత దర్శకుడు ఇళయరాజా సహా దేశవ్యాప్తంగా పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆమె భౌతికంగా దూరమైనా, తన గాత్రంతో ఎప్పటికీ జీవించే ఉంటారని అభిమానులు భావోద్వేగానికి గురయ్యారు.

# ఇరాన్ ప్రతీకార చర్యలు

**- అమెరికా స్థావరాలపై భీకర దాడులు, హర్మ్యూజ్ మూసివేత**



టెహ్రాన్ (ప్రశ్న న్యూస్) మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరోసారి భగ్గుమన్నాయి. తమ దేశ దక్షిణ ప్రాంతాలపై అమెరికా సైన్యం దాడులకు పాల్పడిందని ఆరోపిస్తూ ఇరాన్ తీవ్రంగా స్పందించింది. దీనికి ప్రతీకారంగా జోర్డాన్, ఖతార్, ఒమన్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఆదివారం దాడులు చేసినట్టు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ప్రకటించింది. అంతటితో ఆగకుండా హర్మ్యూజ్ జలసంధిని తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు మూసివేస్తున్నట్లు స్పష్టం చేసింది. తమ అధికారిక మీడియా సంస్థ సెపాహ్ న్యూస్ ద్వారా ఐఆర్జీసీ ఈ వివరాలు వెల్లడించింది. తమ దక్షిణ తీరప్రాంతాల్లోని పలు సైనిక స్థావరాలు, కమ్యూనికేషన్ టవర్లపై యూఎస్ వైమానిక దాడులు చేసిందని పేర్కొంది. దీనికి ప్రతీకారంగా మూడు దశల్లో దాడులు చేశామని తెలిపింది. మొదటి దశలో జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్‌బేస్‌ను లక్ష్యంగా చేసుకుని, అక్కడి కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్ల హ్యాంగర్‌ను ధ్వంసం చేశామని వివరించింది. రెండో దశలో ఖతార్‌లోని అల్ ఉదెయిద్ ఎయిర్‌బేస్‌పై దాడి చేసి, కమాండ్ సెంటర్‌తో పాటు ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణ కేంద్రాలను ధ్వంసం చేశామని పేర్కొంది. మూడో దశలో ఒమన్‌లోని దుక్మ్ పోర్టులో ఉన్న అమెరికా లాజిస్టికల్ కేంద్రాలపై భారీ దాడి చేశామని తెలిపింది. ఇరాన్ సైన్యం కూడా కువైట్, బహ్రెయిన్‌లలోని అమెరికా స్థావరాలపై కమికాజే డ్రోన్లతో దాడులు చేసిందని, రాడార్ సైట్లు, ఆయుధ డిపోలను ధ్వంసం చేసిందని వెల్లడించింది. అమెరికా మళ్లీ దాడులకు పాల్పడితే మరింత తీవ్రమైన ప్రతిచర్యలు ఉంటాయని ఐఆర్జీసీ హెచ్చరించింది. అమెరికా జోక్యం ఆగే వరకు హర్మ్యూజ్ జలసంధి మీదుగా ఏ నౌకనూ అనుమతించబోమని స్పష్టం చేసింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588